నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com    ఎడిటర్: బైస దేవదాస్    సెల్:9000065433    E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్    శుక్రవారం 11-9-2026    NETI NIZAM Telugu Daily,  RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026.  Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001.    సంపుటి :33    సంచిక:35    పేజీలు:6    వెల: రూ.1/-


## నేటి కందం-నేటికి అందం

మన వారగు దివ్యాంగులు
చణులై పోరాడి రెండు స్వర్ణమ్ములపై
ఘన కాంస్యమ్ములు నాలుగు
గొని సీమకు ఖ్యాతి నిడిరి కుశలత తోడన్ !!

(దివ్యాంగుల క్రీడా విభాగంలో మన దేశ దివ్యాంగులు పాల్గొని రెండు స్వర్ణాలు, నాలుగు కాంస్యాలు సాధించి దేశానికి మంచి పేరు తెచ్చారు. ఇది అందరూ సంతోషించ దగిన విషయం).



-రాధశ్రీ
సెల్:9494481210

## చురక

అసెంబ్లీలు పార్లమెంట్
అన్నిటిలో అదే రీతి
చట్టసభల హుందాతనం
చంపే దుష్ట రాజనీతి.
సాగలేక నేల వాలే
సమస్యల పైన చర్చ
అధికారం ప్రతిపక్షం
ఆగడాల వల్ల మూర్చ



-వేల్పుల నారాయణ
9440433475

# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై అసెంబ్లీలో చర్చ..



హైదరాబాద్, సెప్టెంబర్ 10:తెలంగాణలో ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రిజర్వాయర్లపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం సహా పలు రిజర్వాయర్లను పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా సభ్యులు సోలార్ పవర్‌పై ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి వివరణ ఇస్తూ కీలక విషయాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని తెలిపారు. అయితే, దీనికి అధిక వ్యయం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల కారణంగా ఒక్క మెగావాట్‌కు రూ.1.30 కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. కేంద్రం నిబంధనలు సడలిస్తే పెట్టుబడులు మరింత పెరుగుతాయని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందని.. పారిశ్రామిక వృద్ధితో డిమాండ్ భారీగా పెరుగుతోందన్నారు. మరోవైపు, విద్యుత్ సబ్సిడీల కోసం ఏటా రూ.19 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.

అలాగే, సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపైనా కాంగ్రెస్ సర్కార్ దృష్టి పెట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి పేర్కొన్నారు. ఈ మేరకు అమ్రాబాద్‌లో 80 గ్రామాల సోలరైజేషన్‌కు పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో మైక్రో గ్రిడ్‌ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. మరోవైపు, గిరిజన ప్రాంతాల్లో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇందుకోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతులు, ప్రజలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. అలాగే, సోలార్ విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యేలకు భట్టి విక్రమార్క సూచించారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం: మంత్రి రాజనర్సింహ



హైదరాబాద్, సెప్టెంబర్ 10: ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. వారు కోరుకున్న విధంగా ఆరోగ్య సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. జులై 17 నుంచి నూతన ఈహెచ్ఎస్ సదుపాయం అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈహెచ్ఎస్ పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. అర్హులందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. ఓటీపీతో హెల్త్ కార్డు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

గురువారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈహెచ్ఎస్ కింద ఏడాదికి రూ.1,056 కోట్ల బడ్జెట్ కేటాయించామని చెప్పారు. నెలకు రూ.88 కోట్ల నిధులు సమకూరుతున్నాయని వివరించారు. ఉద్యోగులు, పెన్షనర్లు 1.5 శాతం చొప్పున చెల్లింపు.. ప్రభుత్వం కూడా అంతే మొత్తం చెల్లిస్తుందని పేర్కొన్నారు.

921 ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు అందుతాయని అన్నారు. ఆ జాబితాలో 114 ప్రభుత్వ, 807 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 37 వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మరో 25 వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీ-ఆథరైజేషన్ చేసినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు.

# చైనాలోని ఓ పోర్టులో నిలిపి ఉంచిన 'ఓషియన్ మెలోడీ' అనే కార్గో నౌకలో ఘోర అగ్నిప్రమాదం

# 20 మంది సజీవదహనం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: చైనాలోని ఓ పోర్టులో నిలిపి ఉంచిన 'ఓషియన్ మెలోడీ' అనే కార్గో నౌకలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. లైబీరియా జెండాతో ఉన్న ఈ నౌకలో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు సమాచారం.

ఈ దుర్ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. మంటలు వేగంగా వ్యాపించడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం. ప్రమాదం గురించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.అగ్నిప్రమాదానికి గల కారణాలు, మృతుల వివరాలు, సహాయక చర్యలకు సంబంధించిన పూర్తి సమాచారం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ప్రమాదంపై సంబంధిత అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది.

# భార్య ఆత్మహత్య.. ఆందోళనతో రైలు కింద పడి భర్త మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 10: లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. భార్య ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి తీవ్ర ఆందోళనకు గురైన భర్త కూడా ఆత్మహత్యకు పాల్పడటంతో ఒకేరోజు భార్యాభర్తలు మృతి చెందారు. విజయపురి కాలనీలో లక్ష్మి ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

భర్త చరణప్ప.. భార్య మృతదేహాన్ని చూసి భయంతో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అనంతరం లాలాపేట్ రైల్వే బ్రిడ్జి వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఏడాదిన్నర క్రితమే చరణప్ప, లక్ష్మికి వివాహమైనట్లు తెలిసింది.

# ఏపీలో బలపడుతున్న అల్పపీడనం.. మూడు రోజుల పాటు భారీ వర్షాలు..

విశాఖపట్నం, జ ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని విశాఖ తుపాన్ హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ మూర్తి తెలిపారు. ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా బలపడిందని, రానున్న 24 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఈ అల్పపీడనం వాయువ్య దిశగా పయనించే అవకాశముందని వెల్లడించారు.

అల్పపీడన ప్రభావంతో ఏపీలో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని మూర్తి వెల్లడించారు. ముఖ్యంగా ఇవాళ (గురువారం) ఉత్తర కోస్తాలో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశముందని పేర్కొన్నారు. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కురవనున్నట్లు తెలిపారు. శుక్ర, శనివారాల్లోనూ ఏపీలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని మూర్తి చెప్పారు. అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉండటంతో వాతావరణ పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

మరోవైపు, సముద్రంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖ తుపాన్ హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సూచించారు. మూడు రోజుల పాటు సముద్రంలోకి ఎవరూ వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని మూర్తి సూచించారు.

# కనీస వేతనాలు చెల్లించడంలో దేశానికి తెలంగాణ ఆదర్శం: మంత్రి వివేక్



హైదరాబాద్, సెప్టెంబర్10: కనీస వేతనాలు చెల్లించడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు. సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని చెప్పారు. గురువారం తెలంగాణ అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.

అయితే ఇప్పటికే ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ సమస్యలపై ప్రభుత్వం కమిటీ వేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నదీమ్ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఆలోచిస్తున్నామని చెప్పారు. అందుకోసం త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి వివేక్ వెంకట స్వామి ప్రకటించారు.

# బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా చర్యలు వేగవంతం చేయాలి : అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్



ఖమ్మం, సెప్టెంబర్ 10: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ప్రమాదాల నివారణ చర్యలపై ఆయన సమీక్షించారు. జిల్లాలో 42 బ్లాక్ స్పాట్లు గుర్తించినట్లు తెలిపారు. జనవరి నుండి ఆగస్టు 31 వరకు జిల్లాలో 349 రోడ్డు ప్రమాదాలు జరగగా 164 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఒక్క ఆగస్టులోనే 36 ప్రమాదాల్లో 14 మంది మృతి చెందినట్లు తెలిపారు. అతివేగం, హెల్మెట్?సీటు బెల్ట్ వినియోగం లేకపోవడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, రహదారులపై పశువుల సంచారం తదితర కారణాలను అరికట్టాలని సూచించారు.

లబ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రహదారి మార్కింగ్ ఏర్పాటు చేయడంతో పాటు గుంతలను పూడ్చి, రహదారుల వెంట పొదలను తొలగించాలని ఆదేశించారు. ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో వైద్యం అందేలా సమీప ఆస్పత్రులు, అంబులెన్స్‌లను మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీటీఓ వెంకటరమణ, డీపీఓ అనూష, డీఐఈఓ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్‌కుమార్, ఐఆర్ఏడీ జిల్లా మేనేజర్ బాలాజీ పాల్గొన్నారు.

# బ్రిక్స్ సమావేశాలకు జిన్‌పింగ్..



న్యూఢిల్లీ: ఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సు జరగనున్నది. ఆ సమావేశాల్లో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ వస్తున్నారు. ఈ విషయాన్ని ఇవాళ చైనా సర్కారు కన్ఫర్మ్ చేసింది. అయితే గత కొన్ని రోజుల నుంచి జీ జిన్‌పింగ్ హాజరుపై దౌత్యపరమైన ఉత్కంఠ నెలకొని ఉండే. అయితే సెప్టెంబర్ 12 నుంచి 13 వరకు ఢిల్లీలో జరిగే సమావేశాలకు జీ జిన్‌పింగ్ హాజరు అవుతున్నట్లు ఇవాళ చైనా విదేశాంగ శాఖ ఓ ప్రకటన జారీ చేసింది. వాస్తవానికి చైనా అధ్యక్షుడి పర్యటన సమాచారం వెల్లడించేందుకు ఆ దేశ విదేశాంగ ప్రతినిధి గువో జియా కున్ నిరాకరించారు.

దీంతో జిన్‌పింగ్ రాకపై కాస్త అనుమానం నెలకొన్నది. కానీ ఆ డౌట్స్‌ను క్లియర్ చేస్తూ విదేశాంగ శాఖ క్లారిటీ ఇచ్చింది. జిన్‌పింగ్ చివరిసారి 2019లో ఇండియాలో పర్యటించారు. ఆయన చెన్నైలోని మామల్లపురంలో ప్రధాని మోదీ ఆ భేటీలో పాల్గొన్నారు. అయితే 2020లో చోటుచేసుకున్న గల్వాన్ ఘర్షణ తర్వాత జిన్‌పింగ్ ఇండియాలో పర్యటించడం ఇదే మొదటిసారి అవుతుంది.

# ఇందిరమ్మ ఇల్లుకు రూ.5 లక్షలు సరిపోవు..

## కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10: పేదలకు ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ సర్కార్ ఇస్తున్న రూ.5 లక్షలు సరిపోవని ఆ పార్టీ ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి స్వయంగా స్పష్టం చేశారు.

శాసనసభలో ఈ విషయమై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఇల్లు నిర్మాణ ఖర్చు రూ.10 లక్షల కంటే తక్కువ ఎక్కడా అయితలేదు.. ఇప్పుడు నిర్మాణ వ్యయం చాలా పెరిగింది.. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ కార్మికుల సమస్య ఏర్పడ్డది. తక్కువలో తక్కువ ఎక్కడైనా సరే మేస్త్రీలు, లేబర్ చార్జీలకే రూ.3-4 లక్షలు తీసుకుంటున్నారు.. అంతకంటే తక్కువ ఎవరూ అడుగుతలేరు.. మనం ఇన్ని చదరపు అడుగుల్లో కట్టాలని రూల్స్ పెట్టినం.. కానీ కన్‌స్ట్రక్చర్ మెటీరియల్ ధర కూడా పెరిగిపోయిందన్నారు.

సడెన్‌గా ఇల్లు కట్టేసరికి ట్రాక్టర్‌లో ఇసుక తెచ్చుకోవాలన్నా, మెటల్ ధర, లేబర్ ఛార్జీలు పెరిగిపోయాయి. ఈ క్రమంలో రూ.5-7 లక్షల్లో అయ్యేది కాస్తా.. రూ.10-15 లక్షల మధ్యన ఖర్చవుతుంది. ఇది ఎక్కడ చెక్ చేసినా రూ.10 లక్షల కంటే తక్కువ ఎక్కడా అయితలేదన్నారు.

చాలా మంది ఇల్లు వచ్చిందని సంతోషంగా ఉన్నారు. కొందరేమో డబ్బుల్లేక స్టార్ట్ చేసుకోలేదు.. బేస్‌మెంట్ కూడా మొదలుపెట్టలేదు. ఇల్లొచ్చింది కదా మా ఊరిలో 27 ఇండ్లు వస్తే ఏడుగురు స్టార్ట్ చేయలేదంటే.. మా దగ్గర మొదలుపెట్టేందుకు డబ్బుల్లేవ్ సార్ అంటున్నరు.

కొందరేమో డబ్బులు సరిపోక మొదలుపెట్టినం సార్ ఎటుకాకుండా అని చెప్పి.. భార్య బంగారం తాకట్టు పెట్టో,, అప్పు తీసుకొచ్చి మేం ఇల్లు కట్టుకున్నం కానీ డబ్బులు సరిపోకపోయేసరికి మాకు అప్పులైనయ్ అంటున్నారని.. కాబట్టి ఇందిరమ్మ ఇళ్ల బడ్జెట్‌ను పెంచాలని కోరుతున్నా అని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

# భూమాత ఊపిరితిత్తులు అడవులు - హరిత పరిరక్షణకు నడుం బిగించలేమా !

## (11 సెప్టెంబర్ "ప్రపంచ అటవీ అమరవీరుల దినం" సందర్భంగా)

అటవీ సంపదలు భూమాతను ఊపిరితిత్తులు. అడవులు పర్యావరణ సమతుల్యతకు పునాది రాళ్లు. అటవీ సంపద తరిగితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. మనం రేపటి తరానికి ఆస్తులు ఇవ్వవచ్చు, కాని పీల్చే గాలి, తాగే నీరు, నడిచే నేల కలుషితం అయితే మన సంపాదన వారి ఆరోగ్యకర మనుగడకు అడ్డుగా నిలుస్తుంది. పర్యావరణం అందరిదీ. దానిని కాపాడే బాధ్యత కూడా మనందరిది. అడవులు, వన్యప్రాణుల రక్షణ బాధ్యలు నిర్వహిస్తున్న సిబ్బంది పలు రకాల ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు, కొన్ని సందర్భాల్లో ప్రాణాలను సహితం కోల్పోతున్నారు. అటవీ సంపద రక్షణలో ప్రాణాలు కోల్పోతున్న అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏట భారత అటవీ మంత్రిత్వశాఖ చొరవతో 11 సెప్టెంబర్ రోజున దేశవ్యాప్తంగా "జాతీయ అటవీ అమరవీరుల దినం (నేషనల్ ఫారెస్ట్ మార్టిర్స్ డే)" పాటించడం 2013 నుంచి ఆనవాయితీగా మారింది.

### ఖేజర్లీ మారణకాండకు గుర్తుగా :

1730లో మార్వా మహరాజు అభయ్ సింగ్ రాథోర్ ఖేజర్లీ సమీప బిష్ణోయ్ గ్రామంలో చెట్లను నరికి వేయాలని ఒక అసాధారణ, ఆలోచనారహిత నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మహారాజుకు వ్యతిరేకంగా గ్రామ ప్రజలు ఎదురు తిరగడంతో జరిగిన హింసలో 363 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. అటవీ రక్షణలో తమ ప్రాణాలను సహితం త్యాగం చేసిన అటవీ అమరవీరులను గుర్తు చేసుకుంటూ జాతీయ అటవీ అమరవీరుల దినం జరుపుకుంటున్నాం. ఫారెస్ట్ రేంజర్స్, గార్డ్స్, అటవీ అధికారులు లాంటి అటవీ సిబ్బంది నేడు సహితం అటవీ రక్షణలో ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు. అడవుల ప్రాధాన్యాన్ని అవహగాహన పర్చడం, హరిత సంపద చేస్తున్న అమూల్య సేవలను ఏకరువు పెట్టడం, అటవీ స్మగ్లర్లు భరతం పట్టడానికి చట్టాలకు పదును పెట్టడం నిరంతరం జరగాలి. అటవీ పరిరక్షణ హీరాలను పరిచయం చేయడం, పర్యావరణ పరిరక్షణ దళాలను ఏర్పాటు చేయడం, సుస్థిర పరిరక్షణ పద్ధతులను ఆచరణలో పెట్టడం, మొక్కలు నాటడాన్ని ఉద్యమంగా చేపట్టడం, పర్యావరణ పరిరక్షణ మార్గాలను ప్రచారం చేయడం, అమరవీరుల కుటుంబాలకు బాసటగా నిలవడం, అడవులను శుద్ధి చేయడం, పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో అటవీ సంపదను కాపాడడానికి ప్రణాళికలు అమలు పరచాలి.

జాతీయ అటవీ అమరవీరుల దినం సందర్భంగా మనం అడవుల ద్వారా పలు రకాల ఆహార పదార్థాలను పొందుతున్నాం. అడవులు లేకపోతే శుద్ధమైన గాలి ఉండదని గమనించి ప్రతి ఒక్కరు తమ కనీస బాధ్యతగా అడవుల పరిరక్షణ ప్రచారాలు నిర్వహించాలి. భారత్‌లోకి మొత్తం భూభాగంలో 21 శాతం భూభాగం అటవీ విస్తీర్ణాన్ని కలిగి ఉన్నాయి. ఎంపీ, అరుణాచల్ రాష్ట్రాల్లో అటవీ విస్తీర్ణం అధికంగా, హర్యానాలా అతి తక్కువగా అడవులు ఉన్నాయి. అడవుల ద్వారా ఆహారం, ఆక్సీజన్, వర్షం, పర్యావరణ పురోగతి, నేల పరిరక్షణ, కలప లాంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని గమనించి హరిత సంపదను కాపాడుకుంటూ రేపటి తరానికి నివాసయోగ్య పర్యావరణాన్ని అందిద్దాం. అడవులు జీవులకు ఆధారం, హరితమే ఆరోగ్యకర వాతావరణానికి పునాది అని నినదిస్తూ వృక్ష సంపదను కాపాడుకుందాం.



-మధుపాళీ
9949700037

# వీరనారి చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయం

## -అడిషనల్ కలెక్టర్ పాండు.

సంగారెడ్డి, సెప్టెంబర్ 10(నె?టి నిజం ప్రతినిధి)వీరనారి



చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్ పక్కన ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా అదనపు కలెక్టర్ పాండుపూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలకు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటానికి సమాజం ఎప్పటికీ రుణపడి ఉంటుందని అన్నారు.

ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, జిల్లా అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ వర్ధంతి పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర జిల్లా స్థాయిలో జయంతి ఉత్సవ సంబరాలు

ములుగు, సెప్టెంబర్ 10:(నేటినిజం ప్రతినిధి): చాకలి ఐలమ్మ వర్ధంతి 10బిష్ట్ర సెప్టెంబర్ ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర జిల్లా స్థాయిలో జయంతి ఉత్సవ సంబరాలు నిర్వహించింది . ఇందులో బాగంగా 10.09. 2026 గురువారం నాడు ఉదయం 10.30 గం,, "సంక్షేమ భవనము" ములుగు జిల్లాలో వర్ధంతి వేడుకలు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అద్వర్యంలో నిర్వహించినారు. ఇందులో బాగంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి శ్రీ బి. రామ్మోహన్ గారు మాట్లాడుతూ చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణ ఉద్యమకారిణి వీరవనిత, తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధె?ర్యశాలి అనికోనియాడరు.

ఈ కార్యక్రమంలో నేరెళ్ళ శంకర్, పరికిరాల రవి,ఎన్నిలా మహేందర్ వడ్డేపల్లి సారంగపాణి జలిగం శ్రీనివాసు తదితర చాకలి సంఘు నాయకులు, బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ. 10,783 కోట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: రైల్వే మంత్రిత్వశాఖకు చెందిన రూ. 10,783 కోట్ల విలువైన మూడు ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఆ ప్రాజెక్టులు:

రైల్వే లైన్ల సామర్థ్యం పెరగడం వల్ల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి. దాంతో భారతీయ రైల్వేల సామర్థ్యం, సేవల విశ్వసనీయత గణనీయంగా పెరుగుతాయి. ఈ మల్టీట్రాకింగ్ ప్రతిపాదనలు.. కార్యకలాపాలను సులభతరం చేయడమే కాకుండా, రైళ్ల రద్దీని తగ్గించడానికి తోడ్పడతాయి. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'నవభారత్' సంకల్పానికి అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టులు.. ఈ ప్రాంతంలో సమగ్ర వికాసాన్ని సాధించి, ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం ద్వారా స్థానికులను 'ఆత్మనిర్భరత' దిశగా నడిపిస్తాయి.

సమీకృత ప్రణాళిక, భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపుల ద్వారా మల్టీ మోడల్ అనుసంధానాన్నీ, వస్తు రవాణా సామర్థ్యాన్నీ పెంపొందించే లక్ష్యంతో.. ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ బృహత్ప్రణాళిక ఆధారంగా ఈ ప్రాజెక్టులను రూపొందించారు. ప్రజల రాకపోకలకు, సరుకులు, సేవల రవాణాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా, నిరంతర అనుసంధాన సదుపాయాన్ని ఈ ప్రాజెక్టులు అందిస్తాయి.

పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన 14 జిల్లాల పరిధిలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులు.. భారతీయ రైల్వే నెట్వర్క్ ప్రస్తుత సామర్థ్యాన్ని 656 కి.మీ మేర విస్తరించనున్నాయి. ఈ ప్రతిపాదిత మల్టీట్రాకింగ్ ప్రాజెక్టుల ద్వారా.. దాదాపు 56 లక్షల జనాభా ఉన్న 4,790 గ్రామాలకు రవాణా సదుపాయం మెరుగుపడనుంది.

తారాతారిణి ఆలయం, శ్రీ ఖేత్రా జగన్నాథాలయం (రఘూర్నగూడ సమీపంలోని పురాతన ఆలయం), బాంధవ్‌గఢ్ పులుల సంరక్షణ కేంద్రం, విరాటేశ్వరాలయం, అమరకంటక్ ఆలయం, జ్వాలేశ్వర్ ధామ్, అచనక్‌మార్ పులుల సంరక్షణ కేంద్రం, ఖుతాఘాట్ డ్యామ్, మల్హార్ పురావస్తు ప్రదేశం, రతన్‌పూర్ మహామాయ ఆలయం సహా.. దేశవ్యాప్తంగా ప్రముఖ పర్యాటక గమ్యస్థానాలకు రైల్వే ప్రయాణాన్ని ఈ ప్రతిపాదిత అభివృద్ధి కార్యక్రమాలు మరింత మెరుగుపరుస్తాయి.

బొగ్గు, సిమెంటు, ఇనుము, ఉక్కు వంటి ముఖ్యమైన ఉత్పత్తుల రవాణాకు ఈ ప్రతిపాదిత ప్రాజెక్టులు అత్యంత కీలకమైన మార్గాలు. రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచేలా రూపొందించిన ఈ ప్రాజెక్టుల వల్ల.. ఏటా అదనంగా 27 మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) సరుకుల రవాణా సాధ్యమవుతుంది. రైల్వే రవాణా వ్యవస్థ పర్యావరణ అనుకూలమైనదీ, తక్కువ ఇంధన వినియోగం కలిగినదీ కావడంతో.. ఇది దేశ వాతావరణ లక్ష్యాలను సాధించడంలోనూ, వస్తు రవాణా వ్యయాన్ని తగ్గించడంలోనూ తోడ్పడుతుంది. అంతేకాకుండా దాదాపు 12 కోట్ల లీటర్ల మేర ముడిచమురు దిగుమతులను తగ్గించడంతోపాటు.. దాదాపు 62 కోట్ల కేజీల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గిస్తుంది. ఇది 2.48 కోట్ల మొక్కలను నాటడంతో సమానం.

# ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు

## తెలంగాణ వీరవనిత పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలి



ఆదిలాబాద్, సెప్టెంబర్ 10: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ వీరవనిత, తొలి భూపోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 20వ వార్డు కౌన్సిలర్ కూతురు ప్రభాకర్, మంద వేణుగోపాల్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో రజక సంఘం కోశాధికారి కంచర శ్రీనివాస్, మాధవ్ మల్లయ్య, నాగరాజు, రామిళ్ల మల్లేష్, పూర్ణచందర్, రవీందర్‌తో పాటు రజక సంఘం మహిళా సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.10,021 కోట్లు

## 2029-30 నాటికి పూర్తి చేసేలా ప్రణాళికల రూపకల్పన

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 10:సుమారు రూ.10,021 కోట్ల అంచనా వ్యయంతో రైల్వే మంత్రిత్వ శాఖకు సంబంధించి అయిదు నూతన ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ఆ ప్రాజెక్టుల వివరాలు:

రైలు మార్గాల సామర్థ్యం పెరగటం వల్ల రవాణా సౌలభ్యం మెరుగవుతుంది. దీనివల్ల భారత రైల్వేల నిర్వహణ సామర్థ్యం, సేవలపై విశ్వాసం పెరుగుతాయి. కార్యకలాపాల క్రమబద్ధీకరణకు, రద్దీని తగ్గించేందుకు ఈ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు సహాయపడతాయి. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కలలుగన్న న్యూ ఇండియాకు అనుగుణంగా ఈ ప్రాజెక్టులున్నాయి. సమగ్రాభివృద్ధి ద్వారా ఆ ప్రాంత ప్రజలు "ఆత్మనిర్భర్" ను సాధించటంతో పాటు స్థానికంగా ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి.

పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టులను రూపొందించారు. సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా మల్టీ మోడల్ అనుసంధానతను, రవాణా సామర్థ్యాన్ని పెంపొందించటం ఈ ప్రాజెక్టుల ఉద్దేశం. ప్రజలు, సరకులు, సేవల రవాణాకు అంతరాయం లేని అనుసంధానతను ఇవి అందిస్తాయి.

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలోని 17 జిల్లాల మీదుగా వెళ్లే ఈ అయిదు ప్రాజెక్టులు భారత రైల్వే పరిధిని దాదాపు 540 కిలోమీటర్ల మేర పెంచుతాయి. ఆమోదం పొందిన ఈ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 52 లక్షల జనాభా గల దాదాపు 2,121 గ్రామాలకు అనుసంధానాన్ని మెరుగుపరుస్తాయి.

ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టుల సామర్థ్యం ద్వారా తిరుపతి, సుబ్రమణ్యస్వామి ఆలయం (తిరుత్తణి), శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం (తిరుచానూరు), కోటిలింగేశ్వర దేవాలయం, శ్రీ సీతి భైరవేశ్వర స్వామి ఆలయం, బంగారు తిరుపతి, కోలార్ బంగారు గనులు, హొగెనక్కల్ జలపాతం, హోసూర్ కోట, మెట్టూర్ డ్యామ్, కొడైకెనాల్ కొండలు, సత్యమంగళం వన్యప్రాణుల అభయారణ్యం, నమక్కల్ ఆంజనేయర్ ఆలయం, నమక్కల్ కోట, కళ్యాణ పశుపతేశ్వర ఆలయం, యాదగిరిగుట్ట ఆలయం, భువనగిరి కోట, సురేంద్రపురి, స్వర్ణగిరి ఆలయం వంటి దేశవ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు రైలు అనుసంధానం మెరుగవుతుంది.

బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైల్స్, ఆహారధాన్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువులు వంటి వస్తువుల రవాణాకు ఈ ప్రాజెక్టులు కీలక మార్గాలు. ఈ పెంపుదల ద్వారా ఏటా అదనంగా 47 ఎంటీపీఏ ( ఏడాదికి మిలియన్ టన్నుల) సరకు రవాణా సాధ్యమవుతుంది. పర్యావరణహిత, శక్తి సామర్థ్యాలు గల రవాణా వ్యవస్థ రైల్వేలు. దేశ వాతావరణ లక్ష్యాలను చేరుకోవటంలో, రవాణా ఖర్చులను తగ్గించటంలో ఇవి ఉపయోగపడతాయి. ఇవి చమురు దిగుమతి (సుమారు 8 కోట్ల లీటర్ల)ని తగ్గించి, కర్బన ఉద్గారాల (సుమారు 42 కోట్ల కిలోల) విడుదలను తగ్గిస్తాయి. ఇది సుమారు 2 కోట్ల మొక్కలు నాటటంతో సమానం.

# పరివర్తనను తెచ్చేది జ్ఞానమే... ఓ సుభాషితాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:సమాజంతో సద్భావనను కలిగి ఉండే కళను జ్ఞానం నేర్పిస్తుందని ప్రస్తావిస్తున్న సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు. జ్ఞానంతో వివేకాన్నీ, ధనాన్నీ పొందవచ్చును. జ్ఞానం.. మనసును ఆనందంతో నింపివేస్తుంది. ఫలితంగా వ్యక్తి ఆత్మగౌరవం పెంపొందుతుందని ప్రధానమంత్రి అన్నారు.

సమాజంతో సద్భావనను కలిగివుంటూ జీవించే కళను విద్య నేర్పుతుంది. ఈ జ్ఞానమే వివేకాన్నీ, ధనాన్నీ అందిస్తుంది. వ్యక్తి మనసును సంతోషంతో నింపివేయడంతో పాటు, వ్యక్తి ఆత్మగౌరవాన్ని కూడా పెంపొందిస్తుంది. ఈ కారణంగా సుపరిపాలన అందజేసే సేవ మాదిరిగానే విద్య కూడా చాలా విలువైందీ, మనసు ప్రేమించేదీ, జీవన స్థాయిని పెంపొందింప చేసే శక్తిగా చెప్పవచ్చని ఈ సుభాషితం మనకు బోధిస్తోంది.

# గణేష్ మండళ్లకు ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి

## పోలీస్ శాఖకు నిర్వాహకులు సహకరించాలి: ఎస్ఐ జాడీ శ్రీధర్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 10: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేష్ మండళ్లు ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని రామకృష్ణాపూర్ పట్టణ ఎస్ఐ జాడీ శ్రీధర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండపాల ఏర్పాటు, నిమజ్జన వివరాలు ముందుగానే పోలీసులకు అందితే పటిష్ట బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని తెలిపారు.

గణేష్ మండళ్ల నిర్వాహకులు ఎలాంటి ఆలస్యం చేయకుండా తెలంగాణ పోలీస్ అధికారిక పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎస్ఐ సూచించారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహక కమిటీ వివరాలు, విగ్రహం ఎత్తు, ఉత్సవాల రోజులు, నిమజ్జన తేదీ, మార్గం తదితర వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని కోరారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం పోలీస్ శాఖ నుంచి క్యూఆర్ కోడ్‌తో కూడిన అనుమతి పత్రం జారీ చేస్తామని, దానిని మండపంలో తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు

# ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

## ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, సెప్టెంబర్ 10: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం ఉట్నూర్ సబ్‌కలెక్టర్, ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ ప్రణయ్‌కుమార్‌తో కలిసి మండలంలోని నర్సాపూర్ (బి) గ్రామపంచాయతీని కలెక్టర్ సందర్శించారు. గ్రామంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముక్తి బిజిలీ యోజనలో మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించా . అనంతరం గ్రామంలోని ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, భోజనం, వసతి సౌకర్యాలపై పాఠశాల హెచ్ఎం రాథోడ్ ప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

అనంతరం గ్రామస్తులతో సమావేశమైన కలెక్టర్ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకునేలా లబ్ధిదారులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ హెచ్.కె. గంగారం, గ్రామస్తులు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు.

KAVISANGAMAM
the Poetry Space

సీజన్: 2
సీరీస్: 47

12 సెప్టెంబర్ 2026
రెండవ శనివారం
సా. 6 గంటలకు

రెండుతరాల కవిసంగమం

సౌజన్యవేదిక:
శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం
సుల్తాన్ బజార్(రాంకోఠి)
కోఠి, హైదరాబాద్

పాల్గొంటున్న కవులు



కాంచనపల్లి గోవర్ధన్ రాజు
ఫణిమాధవి కన్నోజు
గంగిరెడ్డి విశ్వనాథరెడ్డి
దండు వెంకట్రాములు
స్వప్న కొండమడుగు

# నాణ్యమైన ఆయుష్ సేవల కోసం పిలుపునిచ్చిన కేంద్రమంత్రి శ్రీ ప్రతాపరావ్ జాదవ్




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: దేశవ్యాప్తంగా అందరికీ అందుబాటులో ఉండేలా, ప్రజలే కేంద్రంగా, నాణ్యమైన ఆయుష్ సేవలు అందించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ (స్వతంత్ర హోదా), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సహాయమంత్రి శ్రీ ప్రతాపరావ్ జాదవ్ కోరారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో నిన్న నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆయుష్ వ్యవస్థ బలోపేతం' జాతీయ కార్యశాలలో ఆయన ప్రసంగించారు.

ఈ కార్యశాలలో కేంద్ర ప్రభుత్వం, 30కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సీనియర్ అధికారులు, వివిధ సంస్థలకు చెందిన నిపుణులు సమావేశమయ్యారు. వారి అనుభవాలు, ఉత్తమ పద్ధతులు, పరస్పర సహకార విధానాల ద్వారా ఆయుష్ వ్యవస్థను బలోపేతం చేయటంపై చర్చించారు.

ఈ ప్రారంభ కార్యక్రమానికి శ్రీ ప్రతాపరావ్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నీతి ఆయోగ్ సభ్యుడు (ఆరోగ్య శాఖ) ప్రొఫెసర్ (డాక్టర్) ఎం. శ్రీనివాస్, ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేశ్ కొటేచా కూడా పాల్గొన్నారు.

శ్రీ ప్రతాపరావ్ జాదవ్ ప్రసంగిస్తూ... ఆయుష్ వ్యవస్థల విస్తృతిని, వాటి ప్రభావాన్ని మరింత పెంచేందుకు కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చేందుకు ఆయుష్ వైద్య సేవల్లో నాణ్యత ఉండేలా, ప్రజలకు అందుబాటులో ఉండేలా, ప్రజలే కేంద్రంగా ఉండే విధానంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు.

సమగ్ర ఆరోగ్య సంరక్షణలో సాంకేతికత, సాక్ష్యాధారిత విధానాల ప్రాముఖ్యతను ప్రొఫెసర్ (డాక్టర్) ఎం. శ్రీనివాస్ స్పష్టం చేశారు. దీనికి భారత్‌లోనే కాక, ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచగలిగే సామర్థ్యం ఉందన్నారు.

ఆయుష్ వ్యవస్థను బలోపేతం చేయటంలో, క్షేత్రస్థాయిలో ఆయుష్ సేవలను సమర్థవంతంగా అందించటంలో రాష్ట్రాలు, యూటీల కీలక పాత్రను వైద్య రాజేశ్ కొటేచా తెలియజేశారు. ఆయుష్ ఆరోగ్య సేవలు, విద్య, పరిశోధన, సామర్థ్య పెంపు, ఆరోగ్య వ్యవస్థతో విస్తృత అనుసంధానం వంటి కీలక రంగాల్లో అనుభవాలు, ఉత్తమ పద్ధతులు, వినూత్న విధానాలను పంచుకునేందుకు రాష్ట్రాలు, యూటీలకు ఈ కార్యశాల వేదికగా నిలిచింది. కేంద్రం, రాష్ట్రాల సహకారం తో బలమైన, ప్రజలకు అందుబాటులో ఉండే, ప్రజలే కేంద్రంగా ఆయుష్ వ్యవస్థ ఏర్పాటుకు, సంపూర్ణ ఆరోగ్య సంరక్షణను అందరికీ అందించాలనే ప్రభుత్వ దార్శనికతకు ఈ చర్చలు ప్రాధాన్యతనిచ్చాయి.

# ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026 ను ప్రారంభించిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026 ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ముంబైలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన ఆవిష్కర్తలకు, నాయకులకు, పెట్టుబడిదారులకు ప్రధాని సాదర స్వాగతం పలికారు. మూడోసారి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత, ఈ కార్యక్రమంలో వరుసగా మూడోసారి పాల్గొనడం ఎంతో జాతీయ ప్రాధాన్యత కలిగిన 'హ్యాట్రిక్'లా అనిపిస్తోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. "వికసిత భారత్ నిర్మాణంలో మీరు ఎంత ముఖ్యమో, మీ పని కూడా అంతటి కీలకమైనదని ఈ హ్యాట్రిక్ చాటిచెబుతోంది" అని శ్రీ మోదీ అన్నారు.

ఫిన్‌టెక్ రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పులను ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, ఈ రంగంలో పెరుగుతున్న ఉత్సాహం, యువత భాగస్వామ్యం, ధైర్యంతో కూడిన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం సరికొత్త అవకాశాలకు బాటలు వేస్తున్నాయని పేర్కొన్నారు. వ్యవస్థలో కనిపిస్తున్న ఈ సజీవ ప్రగతి దేశ భవిష్యత్తుపై తనకున్న నమ్మకాన్ని మరింత పెంచుతోందని ఆయన అన్నారు. "అందుకే వికసిత్ భారత్ భవిష్యత్తుపై నా విశ్వాసం రోజురోజుకూ మరింత బలోపేతమవుతోంది" అని అన్నారు.

సాంకేతిక ఆవిష్కరణలకు, సాంస్కృతిక వేడుకలకు అందమైన అనుబంధాన్ని వివరిస్తూ, మహారాష్ట్రతో పాటు దేశమంతటా ఎంతో ఉత్సాహంతో జరుపుకొనే గణేష్ ఉత్సవాల పండుగ వాతావరణాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. శుభకార్యాలు ప్రారంభించే ముందు దైవానుగ్రహం పొందే సాంప్రదాయాన్ని పాటిస్తూ ఆయన విఘ్నేశ్వరునికి నమస్కరించారు. "గణపతి బప్పాకు నమస్కరిస్తూ, మీ అందరికీ గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026 శుభాకాంక్షలు" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

యుద్ధాలు, వాణిజ్య ఉద్రిక్తతల వల్ల ఇంధనంతో పాటు సరుకుల సరఫరా వ్యవస్థలపై తీవ్ర ఒత్తిడి వంటి క్లిష్టమైన ప్రపంచ పరిస్థితులను ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత్ నమోదు చేసిన 7.8 శాతం బలమైన వృద్ధి రేటును ఆయన గుర్తుచేశారు. అంతర్జాతీయ సమాజానికి కొత్త నమ్మకాన్ని ఇస్తున్న భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని ఆయన ప్రశంసించారు. "ఆ నమ్మకం ఇక్కడ ఉన్న మీ అందరి ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తోంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

భారత ఆర్థిక పురోగతికి లభించిన ఒక ప్రధాన గుర్తింపును ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, మూడు దశాబ్దాల తర్వాత జపాన్‌కు చెందిన ఒక క్రెడిట్ రేటింగ్ సంస్థ దేశ సార్వభౌమ రేటింగ్‌ను 'ఏ-' కేటగిరీకి పెంచడాన్ని అభినందించారు. ఈ చారిత్రాత్మక మైలురాయికి వ్యవస్థాగత సంస్కరణలు, స్థూల ఆర్థిక స్థిరత్వమే కారణమని పేర్కొంటూ, దేశ వృద్ధి వేగం ఏమాత్రం ఆగదని స్పష్టం చేశారు. "భారత్ చేపట్టిన ఈ సంస్కరణల ఎక్స్‌ప్రెస్ మరింత వేగంగా ముందుకు సాగుతుందని నేను మళ్లీ చెబుతున్నాను" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

సాంకేతిక రంగంలో భారత్ సాధించిన అద్భుత పురోగతిని ప్రధానమంత్రి ప్రశంసిస్తూ, ఈ మార్పులో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) నిస్సందేహంగా అత్యంత కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. దేశంలో విప్లవాత్మకంగా మారిన ఫిన్‌టెక్ ప్రయాణం గురించి మాట్లాడేటప్పుడు ఈ వేదిక సాధించిన ప్రభావాన్ని ప్రస్తావించకపోతే ఆ చర్చ అసంపూర్ణంగానే ఉంటుందని, గతేడాది వేడుకల్లో కూడా తాను ఇదే విషయాన్ని చెప్పానని ఆయన ఉద్ఘాటించారు. "ఇది ఎంతటి విప్లవాత్మక మార్పంటే, ఫిన్‌టెక్ గురించి ఎప్పుడు చర్చించినా యుపిఐ ప్రసక్తి లేకుండా అది పూర్తవదు" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఆగస్టు 25న జరుపుకున్న యుపిఐ పదవ వార్షికోత్సవాన్ని ప్రధానమంత్రి గుర్తుచేస్తూ, ప్రారంభంలో ఆర్థిక రంగ నిపుణులు వ్యక్తం చేసిన అనుమానాలతో నేటి వాస్తవ పరిస్థితులను పోల్చారు. ఒకప్పుడు బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్న కోట్లాది మంది పౌరులే నేడు డిజిటల్ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బ్యాంకింగ్ సేవలను ప్రజల చేతుల్లోకి తీసుకురావాలనే తన తొలి ఆలోచనను మేధావులు ఒకప్పుడు అసాధ్యమని భావించారని ఆయన గుర్తుచేశారు. "తరతరాలుగా బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉన్న అదే కోట్లాది మంది ప్రజలు నేడు భారతదేశంలో ఫిన్‌టెక్ వృద్ధికి ప్రధాన శక్తిగా మారారు'' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

అతిపెద్ద నిర్వహణ గణాంకాలను ప్రధానమంత్రి వెల్లడిస్తూ, ఒక్క ఆగస్టు నెలలోనే 24 బిలియన్లకు పైగా యుపిఐ లావాదేవీలు జరిగాయని, అంటే ఈ కార్యక్రమం ప్రారంభమైన మొదటి పది నిమిషాల్లోనే దాదాపు 50 లక్షల లావాదేవీలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ అసాధారణమైన వినియోగ వేగం కేవలం సాంకేతికతకు మాత్రమే పరిమితం కాలేదని స్పష్టం చేసేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ వ్యాఖ్యలను ఆయన ఉటంకించారు. "ఈ ప్రభావం వల్లే యుపిఐ కేవలం ఒక సాంకేతిక ప్రయాణం మాత్రమే కాదని, ఇదొక నాగరికతా ప్రయాణమని అధ్యక్షుడు మేక్రాన్ అన్నారు" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

భారతదేశ ప్రధాన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ప్రపంచవ్యాప్త విస్తరణను ప్రధానమంత్రి సగర్వంగా ప్రస్తావిస్తూ, ప్రస్తుతం 11 దేశాల్లో యుపిఐ సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఒకప్పుడు అసాధ్యమనుకున్న అంతర్జాతీయ చెల్లింపులను ఇది దైనందిన వాస్తవంగా మార్చిందని ప్రకటించారు. ఈ అద్భుత గణాంకాలు దేశం సాధించిన సుదీర్ఘ ప్రగతికి నిదర్శనమని ఆయన పేర్కొన్నా. "మనం ఎంత సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేశామో ఈ అద్భుత గణాంకాలే చెబుతున్నాయి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

భావి లక్ష్యాలకు బాటలు వేస్తూ ప్రస్తుత విజయాలను గమ్యస్థానంగా కాకుండా ఒక ప్రారంభ బిందువుగా మాత్రమే చూడాలని పరిశ్రమాధిపతులకు ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. విధాన రూపకల్పన, అమలులో తనకున్న 25 ఏళ్ల అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ నిరంతర పురోగతి సాధించడమే తన సిద్ధాంతమని ఆయన స్పష్టం చేశారు. "ఒక లక్ష్యం పూర్తవ్వగానే, అంతకంటే పెద్ద లక్ష్యం సాధించేందుకు నేను సమాయత్తమవుతాను" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

అంతర్జాతీయ డిజిటల్ చెల్లింపుల తదుపరి వ్యూహాత్మక దిశను ప్రధానమంత్రి ప్రముఖంగా చెబుతూ, సింగపూర్‌తో ఇప్పటికే ఏర్పడిన సునాయాస సరిహద్దు లావాదేవీల అనుసంధానం లాగే ఇతర భాగస్వామ్య దేశాల స్వదేశీ చెల్లింపు వ్యవస్థలతో యుపిఐని అనుసంధానించాల్సిన అత్యవసర ప్రాధాన్యతను స్పష్టం చేశారు. భారతీయులు పెద్ద సంఖ్యలో నివసించే ప్రాంతాలలో, వాణిజ్యం భారీగా జరిగే దేశాలలో ఆర్థిక నెట్‌వర్క్‌లను క్రియాశీలంగా జతచేయాలని ఆయన సంబంధిత భాగస్వాములను ఆదేశించారు. "భారతీయులు ఎక్కడైతే ఎక్కువ సంఖ్యలో ఉంటారో, భారత్ ఎక్కడైతే విస్తృత స్థాయిలో వాణిజ్యం సాగిస్తుందో, ప్రపంచంలో ఏ దేశమైతే మనతో కలసి నడవడానికి సిద్ధంగా ఉందో వారందరినీ అనుసంధానించే దిశగా మనం పనిచేయాలి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ప్రవాస భారతీయులకు చేకూరే ఆర్థిక ప్రయోజనాలను ప్రధానమంత్రి వివరిస్తూ, ప్రపంచంలోనే అత్యధికంగా స్వదేశానికి నిధులు పంపే భారతీయ వర్గానికి లావాదేవీల వ్యయాన్ని తగ్గించడం అత్యంత ప్రాధాన్య అంశమని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలను అనుసంధానించడం ద్వారా స్వదేశంలోని కుటుంబాలకు నిధులు వేగంగా చేరుతాయని ఆయన వివరించారు. ''దీనివల్ల కూడా భారతీయులకు యుపిఐ ఆదా కలిగిస్తుంది, అలాగే స్వదేశంలోని భారతీయ కుటుంబాలకు డబ్బు మరింత వేగంగా చేరుతుంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ఆర్థిక మౌలిక సదుపాయాలలో విప్లవాత్మక మార్పు రావాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. విదేశీ నమూనాలతో రూపొందించిన కార్డ్ చెల్లింపుల ప్రమాణాలపై ఆధారపడే పాత పద్ధతిని విమర్శిస్తూ, స్వదేశీ నిబంధనలు, ప్రోటోకాల్‌లను తయారు చేసుకోవాలని ఆయన సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలను అభివృద్ధి చేసే సామర్థ్యం భారతీయ పరిశ్రమకు పూర్తిస్థాయిలో ఉందని ఆయన ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇప్పుడు మన స్వంత నిబంధనలు, ప్రమాణాలను రూపొందించుకుని ప్రపంచంతో అనుసంధానం చేయగలం'' అని శ్రీ మోదీ అన్నారు.

సాంకేతిక సాధికారతపై తన మూల దృక్కోణాన్ని పునరుద్ఘాటిస్తూ- సంప్రదాయ బ్యాంకింగ్ విధానాలు విస్మరించిన రంగాల్లోకి విజయవంతంగా చొచ్చుకుపోతున్న యూపీఐని, ఆర్థిక సార్వజనీనత సాధనలో అంతిమ ఉపకరణంగా ప్రధానమంత్రి అభివర్ణించారు. వ్యక్తికి నేరుగా సేవా ప్రదానమే ఆవిష్కరణల వాస్తవ లక్షణమని ఆయన స్పష్టం చేశారు. "సంప్రదాయ బ్యాంకులు, బ్యాంకు శాఖలు చేరుకోలేని ప్రాంతాలకు, వ్యక్తుల చెంతకు ఆ వ్యవస్థను యూపీఐ తీసుకు వెళ్లింది'' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

దేశీయ ఫిన్‌టెక్ మార్కెట్ భవిష్యత్ గమనాన్ని నిర్దేశిస్తూ- చెల్లింపుల పరిష్కారానికి మించి, వేగంగా ముందుకు సాగాల్సిన ఆవశ్యకతను ప్రధానమంత్రి ప్రస్ఫుటం చేశారు. రుణం, బీమా, పొదుపు, పెట్టుబడులు, పింఛను ఉత్పత్తుల పరిధిని చురుగ్గా విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ రంగం తన సేవలను వేగంగా తదుపరి స్థాయికి చేర్చాలని స్పష్టం చేశారు. "ఇప్పుడు ఫిన్‌టెక్ మార్కెట్‌లో చెల్లింపులు సహా రుణ లావాదేవీల వాటా కూడా పెరగాలి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

అట్టడుగు వర్గాల నిబిడీకృత సామర్థ్యాన్ని ప్రస్తావిస్తూ- సంప్రదాయ ఆర్థిక నమూనాలు ప్రస్తుతం విస్మరిస్తున్న జనాభా ఉన్నతీకరణలో వినూత్న ఆర్థిక సాంకేతికత ప్రత్యేకంగా నిలుస్తుందని ప్రధానమంత్రి వివరించారు. జాతీయ ప్రగతి దిశగా ఈ నిగూఢ శక్తిని ఏకీకృతం చేయడం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. "వికసిత భారత్ కోసం, ఈ సామర్థ్యం ఎదుగుదల అత్యంత అవసరం" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ విస్పష్ట ప్రభావానికి ప్రతీకగా 'పీఎం స్వానిధి' పథకాన్ని ప్రధానమంత్రి ఉదాహరించారు.

# మొట్టమొదటిసారిగా నిర్వహించిన ఇన్నోప్రోమ్ ఇండియా 2026లో

## భారత తదుపరి తరం పారిశ్రామిక వ్యవస్థలను ప్రదర్శించిన ఎన్ఐసీడీసీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: న్యూఢిల్లీలోని భారత్ మండపంలో 2026 సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు జరుగుతున్న ఇన్నోప్రోమ్ ఇండియా 2026లో వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగానికి (డీపీఐఐటీ) చెందిన జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ (ఎన్ఐసీడీసీ) పాల్గొంది.

భారత్ లో తొలిసారిగా నిర్వహిస్తున్న ఇన్నోప్రోమ్ కార్యక్రమం భారత్ - రష్యా ప్రత్యేక, విశిష్ట వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కీలక వేదికగా నిలుస్తోంది. ఇరు దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులు, తయారీదారులు, సాంకేతిక సంస్థలు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక సంస్థలను ఈ కార్యక్రమం ఒకే వేదికపైకి తీసుకువచ్చింది.

భారత్, రష్యా 2030 నాటికి సుమారు రూ.9.45 లక్షల కోట్ల (100 బిలియన్ అమెరికా డాలర్లు) ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. విస్తృత ఆర్థిక భాగస్వామ్యంలో తయారీ, పెట్టుబడులు, సాంకేతిక సహకారం, రవాణా, స్థానికీకరణ, పారిశ్రామిక సమూహాలపై క్రమంగా మరింత దృష్టి కేంద్రీకరిస్తున్నారు.

భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, రష్యా పరిశ్రమ, వాణిజ్య మంత్రిత్వ శాఖల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం తయారీ, పారిశ్రామిక సాంకేతికత, స్థానికీకరణ, పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాల రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించింది.

ఎన్ఐసీడీసీ భాగస్వామ్యంతో రష్యా కంపెనీలు, ప్రాంతీయ ప్రభుత్వాలు, సాంకేతిక సేవల సంస్థలు, పెట్టుబడిదారులు, వ్యాపార ప్రతినిధులతో నేరుగా చర్చలు జరిపే అవకాశం లభించింది. దీర్ఘకాలిక తయారీ రంగ పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానాలుగా భారత పారిశ్రామిక కారిడార్లను ప్రదర్శించేందుకు కూడా ఇది దోహదపడింది.

ఎన్ఐసీడీసీ ప్రదర్శన స్టాల్‌కు విశేష స్పందన లభించడంతో పాటు పెద్ద సంఖ్యలో ప్రతినిధులు సందర్శించారు. ఎన్ఐసీడీసీకి చెందిన పారిశ్రామిక స్మార్ట్ నగరాలు, పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న మౌలిక సదుపాయాలు, భవ్య, పీఎం మిత్ర పార్కులు, ఐసీఎల్‌పీ, డిజిటల్ రవాణా కార్యక్రమాలపై ప్రతినిధులు ఆసక్తి చూపించారు.

ఎన్ఐసీడీసీ ప్రతినిధులు వ్యాపార సంస్థల మధ్య సమావేశాలతో పాటు, పెట్టుబడిదారులు, తయారీ సంస్థలు, సాంకేతిక సంస్థలు, ప్రభుత్వ ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పారిశ్రామిక అభివృద్ధి, తయారీ రంగంలో సహకారం, పరస్పర సహకారానికి అవకాశం ఉన్న రంగాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

ఎన్ఐసీడీసీ బృందం ప్రదర్శనలో పాల్గొన్న వివిధ సంస్థల స్టాళ్లను సందర్శించి, నిర్వాహకులతో చర్చలు జరిపింది. అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక సాంకేతికతలు, తయారీ పరిష్కారాలు, వివిధ రంగాల్లోని సామర్థ్యాల గురించి తెలుసుకున్నారు. ఈ పరస్పర చర్చల ద్వారా విజ్ఞానం, పారిశ్రామిక రంగ అనుభవాలను పంచుకోవడంతో పాటు భారత్ - రష్యా మధ్య పారిశ్రామిక, సాంకేతిక సహకారాన్ని మరింతగా విస్తరించేందుకు అవకాశం ఉన్న రంగాలను గుర్తించారు.

భారతదేశం ప్రణాళికాబద్ధంగా చేపట్టిన అతిపెద్ద పారిశ్రామిక మౌలిక సదుపాయల కార్యక్రమాల్లో ఒకటైన జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద ఉన్న అవకాశాలను ఎన్ఐసీడీసీ ఇన్నోప్రోమ్ ఇండియా 2026లో ప్రదర్శించింది.

జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం 11 పారిశ్రామిక కారిడార్లు, 20 గ్రీన్‌ఫీల్డ్ పారిశ్రామిక స్మార్ట్ నగరాలు, 13 రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. ఇప్పటికే నాలుగు పారిశ్రామిక స్మార్ట్ నగరాలు అభివృద్ధి చెందగా, మరో 16 ప్రాజెక్టులు వివిధ దశల్లో అమలులో ఉన్నాయి.

ఈ ప్రాజెక్టులన్నీ కలిపి సుమారు 19,878 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయి. వీటి ద్వారా దాదాపు రూ.5.35 లక్షల కోట్ల (56.6 బిలియన్ అమెరికా డాలర్లు) పెట్టుబడులకు, సుమారు 14 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని అంచనా.

పూర్తయిన, రాబోయే ప్రాజెక్టులను కలుపుకుని, సుమారు 2,109 హెక్టార్ల విస్తీర్ణంలో 469 పారిశ్రామిక స్థలాలను కేటాయించారు. వీటి ద్వారా సుమారు రూ.2.21 లక్షల కోట్ల (23.4 బిలియన్ అమెరికా డాలర్లు) పెట్టుబడులకు, దాదాపు 1.29 లక్షలమందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంది.

ఈ నగరాలను పెట్టుబడులకు సిద్ధంగా, వెంటనే కార్యకలాపాలు ప్రారంభించుకునేలా తయారీ పారిశ్రామిక వ్యవస్థలుగా అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలతో కూడిన పారిశ్రామిక భూమి, విశ్వసనీయ విద్యుత్, నీరు, మురుగునీటి నిర్వహణ వ్యవస్థలు, సమాచార, కమ్యూనికేషన్ సాంకేతిక మౌలిక సదుపాయాలు, జాతీయ రహదారులు, రైల్వేలు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలకు బహుముఖ రవాణా అనుసంధానం ఉన్నాయి.

ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా కూడా అమలు చేస్తున్నారు. దీని ద్వారా పారిశ్రామిక అభివృద్ధిని ప్రధాన రవాణా, సరకు రవాణా వ్యవస్థలతో సమగ్రంగా అనుసంధానించే అవకాశం కలుగుతుంది.

రష్యాకు చెందిన సంస్థలు సహా పలు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కంపెనీలు ఎన్ఐసీడీసీ నగరాల్లో తమ కార్యకలాపాలను నిర్వహిస్తూ, సజావుగా పనిచేస్తున్నాయి.

ద్వైపాక్షిక వేదికలు, పారిశ్రామిక సందర్శనలు, పెట్టుబడులకు సంబంధించిన చర్చల ద్వారా రష్యా ప్రభుత్వ సంస్థలు, దౌత్య వర్గాలు, పారిశ్రామిక సంస్థలు, వ్యాపార ప్రతినిధి బృందాలతో ఎన్ఐసీడీసీ నిరంతరంగా సంప్రదింపులు కొనసాగిస్తోంది. భారత్ - రష్యా తయారీ రంగ సహకారానికి అధునాతన ఇంజినీరింగ్, యంత్ర పరికరాలు, రైల్వేలు, రవాణా పరికరాలు, లోహాలు, ఇంధన, పునరుత్పాదక ఇంధన రంగాలు, ఆటోమొబైల్స్, అంతరిక్ష, రక్షణ, ఔషధాలు, రసాయనాలు, వస్త్రాలు, అధునాతన తయారీ సాంకేతికతలు వంటి రంగాలు ప్రధాన అవకాశాలుగా ఉన్నాయి.

గతంలో రష్యా భాగస్వాములతో జరిగిన చర్చల్లో ఇటువంటి సహకారానికి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణపట్నం పారిశ్రామిక ప్రాంతం, కర్ణాటకలోని తుమకూరు పారిశ్రామిక ప్రాంతం వంటి ఎన్ఐసీడీసీ నగరాలను పరిశీలించగల ప్రాంతాలుగా గుర్తించారు.

మాస్కో ప్రభుత్వంతో ఎన్ఐసీడీసీ కొనసాగిస్తున్న సంప్రదింపుల్లో, భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ఉన్న మాస్కోకు చెందిన కంపెనీలను గుర్తించడం, వ్యాపార సంస్థల మధ్య పరస్పర భాగస్వామ్య అవకాశాల కల్పన, వ్యాపార ప్రతినిధి బృందాల పర్యటనలు, పారిశ్రామిక సమూహాలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లకు సంబంధించిన అనుభవాల మార్పిడి, ఎన్ఐసీడీసీ నగరంలో రష్యా పారిశ్రామిక సమూహాన్ని ఏర్పాటు చేసే అవకాశాలపై చర్చలు కూడా ఉన్నాయి.

ఇటువంటి పారిశ్రామిక సమూహం ద్వారా రష్యాకు చెందిన ప్రధాన తయారీ సంస్థలు, విడిభాగాల సరఫరాదారులు, సాంకేతిక సంస్థలు, భారతీయ భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావచ్చు. తద్వారా స్థానికీకరణ, సాంకేతిక భాగస్వామ్యాలు, పటిష్ఠమైన సరఫరా వ్యవస్థల అభివృద్ధికి తోడ్పడుతుంది.

పారిశ్రామిక కారిడార్లకు మించి, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఏడు పీఎం మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అపారెల్ (పీఎం మిత్ర) పార్కులకు ప్రాజెక్టు నిర్వహణ సంస్థగా ఎన్ఐసీడీసీ వ్యవహరిస్తోంది. ఆధునిక మౌలిక వసతులు, మెరుగైన సరకు రవాణా అనుసంధానంతో సమగ్ర జౌళి తయారీ వ్యవస్థలుగా ఈ పార్కులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

దేశవ్యాప్తంగా 2026?27 ఆర్థిక సంవత్సరం నుంచి 2031?32 ఆర్థిక సంవత్సరం వరకు పెట్టుబడులకు సిద్ధంగా ఉండే, వెంటనే కార్యకలాపాలు ప్రారంభించుకునే సౌకర్యాలతో కూడిన 100 పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి ఉద్దేశించిన భారత్ ఔద్యోగిక వికాస్ యోజన (భవ్య)కు ఎన్ఐసీడీసీ ప్రాజెక్టు నిర్వహణ సంస్థగా మద్దతు అందిస్తోంది. ఈ పథకానికి మొత్తం సుమారు రూ.33,660 కోట్ల (3.56 బిలియన్ అమెరికా డాలర్లు) నిధుల కేటాయింపు ఉంది.

ఎన్ఐసీడీసీ పారిశ్రామిక కారిడార్ భూ వేదిక (ఐసీఎల్‌పీ)ను కూడా ప్రదర్శించింది. భౌగోళిక సమాచార వ్యవస్థ ఆధారంగా రూపొందించిన ఈ జాతీయ వేదిక ద్వారా దేశవ్యాప్తంగా 4,000 పైగా పారిశ్రామిక పార్కులకు సంబంధించిన భూమి లభ్యత, మౌలిక వసతులు, అనుసంధానత వంటి వివరాలను పెట్టుబడిదారులకు అందిస్తుంది.

లాజిస్టిక్స్ డేటా సర్వీసెస్ లిమిటెడ్ (ఎన్ఎల్‌డీఎస్ఎల్) యూనిఫైడ్ లాజిస్టిక్స్ ఇంటర్‌ఫేస్ ప్లాట్‌ఫామ్ (యూఎల్ఐపీ), లాజిస్టిక్స్ డేటా బ్యాంక్ (ఎల్‌డీబీ) ద్వారా భారతదేశ డిజిటల్ లాజిస్టిక్స్ వ్యవస్థను కూడా ఎన్ఐసీడీసీ బలోపేతం చేస్తోంది. ఎల్‌డీబీ ఎగుమతి, దిగుమతి కంటైనర్ల రవాణాపై ప్రారంభం నుంచి ముగింపు వరకు సమగ్ర దృశ్యమానతను అందిస్తూ, ఇప్పటివరకు 10 కోట్లకు పైగా కంటైనర్లను ట్రాక్ చేసింది.

ఎన్ఎల్‌డీఎస్ఎల్ కోయ్లా శక్తి స్మార్ట్ కోల్ అనలిటిక్స్ డ్యాష్‌బోర్డ్‌తో పాటు ట్రాక్ యువర్ ట్రాన్స్‌పోర్ట్ (టీవైటీ), ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (టీఎంఎస్), లాజిస్టిక్స్ ఈ-మార్కెట్‌ప్లేస్ (ఎల్ఈఎంపీ) వంటి పరిష్కారాలను కూడా అభివృద్ధి చేసింది. ఇవి రవాణా అంశాలపై దృశ్యమానత, సామర్థ్యం, డేటా ఆధారిత నిర్ణయాలను మెరుగుపరచడ సహాయపడుతున్నాయి.

పారిశ్రామిక స్మార్ట్ నగరాలు, పీఎం మిత్ర పార్కులు, భవ్య, ఐసీఎల్‌పీ, డిజిటల్ లాజిస్టిక్స్ వ్యవస్థ ద్వారా ఎన్ఐసీడీసీ భారత్‌ను పోటీతత్వం కలిగిన తయారీ, స్థానికీకరణ, పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతోంది. ఆ విధంగా భారత్ - రష్యా ఆర్థిక సహకారాన్ని పారిశ్రామిక పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలు, ఉపాధి అవకాశాలు, పటిష్ఠమైన సరఫరా వ్యవస్థలుగా మార్చేందుకు దోహదపడుతోంది.

# వేద పాఠశాల విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు

### వివిధ సామవేద పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత

### ఈవో చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రాల ప్రదానం



కరీంనగర్, సెప్టెంబర్ 10: శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రాజరాజేశ్వర వేద పాఠశాల విద్యార్థులు వివిధ వేద పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని సరిపల్లె గ్రామంలో ఆగస్టు 28న, రాజమహేంద్రవరంలోని వేద శాస్త్ర పరిషత్‌లో సెప్టెంబర్ 4న, పిఠాపురంలో సెప్టెంబర్ 6న నిర్వహించిన సామవేద పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో మంథనికి చెందిన కే. లక్ష్మీ నరసింహ శర్మ, కరీంనగర్‌కు చెందిన ఎస్. వినాయక శర్మ, మెట్‌పల్లికి చెందిన ఎం. షణ్ముఖ శర్మ, జమ్మికుంటకు చెందిన ఆర్. షణ్ముఖ శర్మ, వేములవాడకు చెందిన ఏ. సత్యనారాయణ శాస్త్రి ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

వేద విద్యలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, విశేష నైపుణ్యాన్ని సాధించాలని ఈవో రమాదేవి ఆకాంక్షించారు. విద్యార్థులు కనబరిచిన ప్రతిభ దేవస్థానం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేద విద్యకు గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేద పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ వంశీ మోహన శర్మతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా రవాణా, సరకులను వేగంగా చేరవేసేందుకు భారతదేశ మౌలిక సదుపాయాల

# అభివృద్ధి.. నూతన అవకాశాల సృష్టి, ఆర్థిక వృద్ధికి ఊతం: పీఎం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:గుజరాత్‌లోని వడోదరలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. పలు ప్రాజెక్టులను ప్రారంభించి, జాతికి అంకితమిచ్చారు. కార్యక్రమానికి హాజరైన అతిథులకు అభినందనలు తెలియజేస్తూ, ప్రధానమంత్రి ప్రసంగాన్ని ప్రారంభించారు. నేరుగా, ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో పాల్గొన్న పౌరులందరికీ స్వాగతం పలికారు. “గుజరాత్ సోదరీసోదరులకు నేను స్వాగతం పలుకుతున్నా” అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

మహారాజా సయాజీరావు యూనివర్సిటీ మైదానంలో ఉత్సాహకరమైన వాతావరణం నెలకొందని చెబుతూ? అభివృద్ధి వేడుకలో పాలుపంచుకునేందుకు వచ్చిన వివిధ రంగాలకు చెందిన నిపుణుల అద్భుత వేదిక అని ప్రధానమంత్రి అన్నారు. ఈ అభివృద్ధి వేడుకకు విచ్చేయటం సంతోషంగా ఉందని తెలిపారు. ‘‘ఇక్కడన్నీ ఏకకాలంలో జరుగుతున్నాయి” అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

దేశ పురోగతిని వేగవంతం చేసేందుకు వేల కోట్ల రూపాయల విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తూ.. తనకు స్వాగతం పలికేందుకు వడోదర ప్రజలు చేపట్టిన అద్భుతమైన స్వచ్ఛతా కార్యక్రమాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు. ఈ అభివృద్ధి పండగ పట్ల స్థానిక ప్రజలు కనబరచిన అంకితభావానికి కృతజ్ఞతలు తెలిపారు. “వికసిత్ భారత్ ప్రయాణానికి మరింత ఊతమిచ్చేందుకు నేడు మీ ముందుకు వచ్చాను” అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

ఎర్రకోట వద్ద ప్రకటించిన ‘సప్తధార’ (ఏడు శక్తి ప్రవాహాలు) గురించి వివరిస్తూ... గతి శక్తి కార్యక్రమం ద్వారా వేగవంతమైన అనుసంధానం అత్యవసరమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఇది కీలకమైన 2,800 కిలోమీటర్ల ప్రత్యేక సరకు రవాణా కారిడార్ పూర్తి కావడాన్ని సూచిస్తుంది. ఈ బృహత్తర ప్రాజెక్టుకు సంబంధించిన తుది అనుసంధానం వడోదరాతో ముడిపడి ఉందని, గతి శక్తి విశ్వవిద్యాలయానికి వడోదరా సరైన నగరమని అన్నారు. “21వ శతాబ్దపు భారతదేశం కోసం ఈ చరిత్రాత్మక కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది” అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

2014 తర్వాత జరిగిన వేగవంతమైన పురోగతిని ప్రస్తావిస్తూ? తూర్పు, పశ్చిమ ప్రత్యేక సరకు రవాణా కారిడార్ల విజయవంతమైన అమలును ప్రధానమంత్రి ప్రశంసించారు. ప్రస్తుతం దేశ వాణిజ్య రూపురేఖలను ఇవి పూర్తిగా మారుస్తున్నాయని తెలిపారు. ఈ వ్యవస్థలు దేశ వాణిజ్యానికి కీలకంగా మారుతున్నాయన్నారు. ‘‘ఈ వ్యవస్థకు ఊతమిస్తూ 2,800 కిలోమీటర్ల కారిడార్ పనులను వేం పూర్తి చేసి చూపించాం” అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

ఈ నూతన జాతీయ రవాణా మార్గం? దేశంలో రవాణా రంగ రూపురేఖలను మార్చేస్తుందని ప్రధానమంత్రి అన్నారు. ప్రయాణికులు, సరకు రవాణా రైలు మార్గాలను వేరు చేయటం వల్ల రోజూ 430కి పైగా గూడ్స్ రైళ్లను నడిపేందుకు వీలవుతుందని తెలిపారు. దీనిద్వారా 30 గంటల ప్రయాణ సమయం కేవలం 10 నుంచి 12 గంటలకు తగ్గిపోతుందని చెప్పారు. 100 కిలోమీటర్ల ప్రయాణానికి గతంతో పోల్చితే ఇప్పుడు సగం కన్నా తక్కువ సమయం పడుతుందని... ఇది ఇంధన ఆదాకు, రవాణా ఖర్చులను తగ్గించేందుకు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. “ఒక మార్గంపైనే పెట్టుబడి పెట్టినప్పటికీ ఎన్నో ప్రయోజనాలు కలిగాయి” అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

రవాణా వ్యవస్థల విస్తరణ వల్ల వ్యవసాయ రంగానికి కలిగే అద్భుతమైన ప్రయోజనాలను తెలియజేస్తూ... తూర్పు, పశ్చిమ భారత్‌లోని రైతులు, నిల్వ చేయలేని వస్తువులను వేగంగా పెద్ద మార్కెట్లకు చేరవేయవచ్చని ప్రధాన మంత్రి వివరించారు. కాలానుగుణంగా వచ్చే పువ్వులు, కూరగాయలు, పండ్ల వంటివి సరైన సమయానికి వినియోగదారులను, మార్కెట్లను చేరుకుంటున్నాయని స్పష్టం చేశారు. ‘‘ఇది రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చింది” అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

నూతన కారిడార్‌కు సంబంధించి అద్భుతమైన కార్యాచరణను పంచుకుంటూ.. జేఎన్‌పీటీ పోర్టు నుంచి వడోదరకు డబుల్-స్టాక్ కంటైనర్ గూడ్స్ రైలు ప్రయాణం విజయవంతం అవటాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు. ఈ ఒక్క రైలు ప్రయాణం ద్వారా ముంబయి నుంచి ఏకంగా 250కి పైగా ట్రక్కులకు సమానమైన సరకును సమర్థవంతంగా రవాణా చేసినట్లు చెప్పారు. ‘‘ఇకపై దేశంలోని ఒక చివరన ఉన్న ప్రాంతం నుంచి మరో చివరన ఉన్న ప్రాంతానికి భారీ మొత్తంలో సరకులు వేగంగా చేరుకోగలవు” అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు కూడా రైలు సేవలను విస్తరించేందుకు చేస్తున్న పలు ప్రయత్నాలను ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఛోటా ఉదయ్‌పూర్, అలీరాజ్‌పూర్ ప్రయాణికులకు ఎంతో మేలు చేసే నూతన రైలు ప్రారంభం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ‘‘దశాబ్దాలుగా రైలు మార్గం లేని భారతదేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా నేడు రైల్వే సేవలు విస్తరిస్తున్నాయి” అని శ్రీ నరేంద్ర అన్నారు.

రోడ్లు, మెట్రోలు, విమానాశ్రయాలు, గ్యాస్ పైపులైన్ల వంటి మౌలిక వసతుల అభివృద్ధి వల్ల కలిగే విస్తృత ఆర్థిక ప్రయోజనాల గురించి ప్రధానమంత్రి వివరించారు. రూ. 2.75 లక్షల కోట్లకుపైగా కేటాయించిన చరిత్రాత్మక రైల్వే బడ్జెట్? కోట్లాది మందికి ఉపాధి అవకాశాలను కల్పించటంలో కీలక ఇంజిన్‌గా పనిచేస్తోందని ప్రధానమంత్రి తెలిపారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, ఓడరేవుల విస్తరణ ద్వారా ఆయా పరిసర ప్రాంతాల్లో సహజంగానే నూతన పరిశ్రమలు, వ్యాపారాలు పుట్టుకొస్తాయని తెలిపారు. “రైల్వేల ఆధునీకరణపై జరుగుతున్న ఖర్చు వేల సంఖ్యలో నూతన ఉద్యోగాలను సృష్టిస్తోంది” అని శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

‘సప్తధార’ దార్శనికతలో భాగంగా తయారీ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యాన్ని వివరిస్తూ... వడోదర పారిశ్రామిక ప్రగతిని ప్రధానమంత్రి ప్రశంసించారు. జౌళి నుంచి పెట్రో రసాయనాల వరకు సాగిన వడోదర 150 ఏళ్ల పారిశ్రామిక ప్రస్థానాన్నీ, గత రెండు దశాబ్దాలుగా ఎంఎస్ఎంఈలకు కేంద్రంగా నగరం సాధించిన అపూర్వ వృద్ధిని కొనియాడారు. తొలిసారిగా దేశీయ పరిజ్ఞానంతో తయారైన సైనిక రవాణా విమానం వడోదరలోనే రూపుదిద్దుకుందని ప్రధాని సగర్వంగా ప్రకటించారు. ఇది నగరానికి తలమానికమైన విజయమంటూ అభినందించారు. “ఇక్కడ తయారు చేసిన సి-295 విమానం ఇప్పటికే విజయవంతంగా గగనతలంలో విహరించింది’’ అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

దశాబ్ద కాలంగా దేశ పారిశ్రామిక సామర్థ్యం విశేషంగా విస్తరించిన విధానాన్ని ప్రధానమంత్రి వివరించారు. ఆధునిక రైల్వే కోచ్‌లు, వ్యాగన్లు, లోకోమోటివ్ ఇంజిన్ల తయారీలో ప్రధాన అంతర్జాతీయ కేంద్రంగా భారత్ నిలిచిన తీరును స్పష్టమైన గణాంకాలతో పేర్కొన్నారు. 2014 నుంచి దేశంలో 50,000 ఆధునిక కోచ్‌లను ఉత్పత్తి చేయడంతోపాటు, సుమారు 2.5 లక్షల వ్యాగన్లను రైల్వేల్లో ప్రవేశపెట్టామని తెలిపారు. “రైలు కోచ్‌లు, మెట్రో కోచ్‌లు, రైలు ఇంజిన్ల తయారీలో కీలక శక్తిగా భారత్ అవత అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

కీలకమైన సరఫరా వ్యవస్థల్లో పూర్తి ఆత్మనిర్భరత సాధించాలన్న లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. దేశీయంగా సౌర పీవీ మాడ్యూళ్ల తయారీని ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో గతంలో భారీగా ఉన్న దిగుమతి ఖర్చులు గణనీయంగా తగ్గడమే కాకుండా.. దేశంలో 200 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెరిగిందని ఆయన తెలిపారు. ‘కడానా’ డ్యాంలో తేలియాడే సౌరవిద్యుత్ ప్రాజెక్టు విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అద్భుత విజయాలను సాధించిందంటూ కొనియాడారు. ఈ పథకం ద్వారా గుజరాత్‌లోని 11 లక్షల కుటుంబాలతోపాటు దేశవ్యాప్తంగా 55 లక్షల కుటుంబాలు విద్యుదుత్పత్తిదారులుగా మారాయనీ, స్థానికంగా భారీగా ఉపాధి అవకాశాలు లభించాయనీ ఆయన పేర్కొన్నారు. “చిప్‌ల నుంచి షిప్‌ల వరకు... తయారీ రంగంలో నూతన శకానికి భారత్ నేడు శ్రీకారం చుడుతోంది” అని శ్రీ మోదీ స్పష్టం వ్యాఖ్యానించారు.

వ్యతిరేకులు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ప్రధానమంత్రి తిప్పికొట్టారు. సౌర, పవన, జల, అణుశక్తి రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ ప్రభుత్వం చేస్తున్న అద్భుత కృషిని దేశ యువత నిశితంగా పరిశీలిస్తోందంటూ ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధిలో దేశం విశేషంగా పురోగమిస్తున్న తీరును యువతరం గుర్తిస్తోందన్నారు. “సత్యాన్ని గర్జిస్తూ దేశ యువత ముందడుగు వేస్తోంది” అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

డేటా సెంటర్లు, కృత్రిమ మేధ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అవసరమైన విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన వ్యూహాత్మక అవసరాన్ని ప్రధానమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. దీని కోసం యురేనియం, కీలక ఖనిజాలు, అరుదైన మూలకాల సరఫరాకు సంబంధించి అంతర్జాతీయ ఒప్పందాలు వేగంగా కుదురుతున్నాయని తెలిపారు. కృత్రిమ మేధ రంగంలో భారత్ అంతర్జాతీయంగా అగ్రగామిగా నిలవాలంటే.. ఈ ప్రాథమిక మౌలిక వసతుల కల్పన అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. “మా శ్రమంతా దేశ యువతకు భద్రమైన భవితను అందించడం కోసమే” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఆధునిక ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న వేగవంతమైన మార్పులను ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కేవలం సాంప్రదాయక డిగ్రీలు మాత్రమే ఇకపై సరిపోవని స్పష్టం చేసిన ఆయన.. నిరంతర నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేసేలా జాతీయ విద్యా విధానాన్ని సమగ్రంగా పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న అవసరాలకు అనుగుణంగా బోధన, శిక్షణ సంస్థలను సంపూర్ణంగా పునర్నిర్మిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. “యువత తగిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఆ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవడమూ నేడు అత్యావశ్యకం’’ అని శ్రీ మోదీ పునురుద్ఘాటించారు.

ఎర్రకోట వేదికగా ఇచ్చిన కీలక హామీని నెరవేర్చేలా... పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారానికి స్వస్తి పలికేలా, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించే విప్లవాత్మక కార్యక్రమాన్ని ప్రధానమంత్రి ప్రకటించారు. విద్యార్థులు తమ కెరీర్ లక్ష్యాలను నెరవేర్చుకునే దిశగా అడుగులు వేసేలా ప్రభుత్వమే బాధ్యతను స్వీకరిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. “మన యువతకు శిక్షణ బాధ్యత ఇకపై ప్రభుత్వానిదే” అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.


సాహిత్యం



శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయ గానసభ
సంయుక్త ఆధ్వర్యంలో
ఆహ్వానం

సంగీతం





ప్రముఖ రచయిత
శ్రీ మాయకుంట్ల నారాయణరెడ్డి గారు
రచించిన
వారేరీ...!?
పుస్తకావిష్కరణ, అంకితోత్సవం





పుస్తకం అంకిత స్వీకర్త :
శ్రీ బైస దేవదాస్ గారు
సంపాదకులు, ‘నేటి నిజం’ దినపత్రిక

తేది : 13-09-2026 ఆదివారం ఉ॥ 10-30 గం॥లకు
వేదిక : గుండవరపు హనుమంతరావు కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్య అతిథి & ఆవిష్కర్త :
పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు
పూర్వ ఉపకులపతి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయము

సభాధ్యక్షులు : ఆచార్య టి. గౌరీ శంకర్ గారు
పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయము

విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్. జనార్ధనమూర్తి గారు
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

పుస్తక పరిచయం : డా॥ నోరి రాజేశ్వరరావు గారు విశ్రాంత ఉపన్యాసకులు

ఆత్మీయ అతిథి : శ్రీ జెల్ది విద్యాధరరావు గారు అధ్యక్షులు, విమల సాహితీ సమితి

అందరూ ఆహ్వానితులే

కళా శారద దీక్షితులు, ప్రధాన కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ
బండారుపల్లి రామచంద్రరావు, అధ్యక్షులు, మానస ఆర్ట్స్
డా॥ లలితవాణి, ఉపాధ్యక్షులు, మానస ఆర్ట్స్
రఘుశ్రీ, కార్యదర్శి, మానస ఆర్ట్స్


## అప్రకటిత విద్యుత్ కోతలకు నిరసనగా బీజేపీ ఆందోళన

కరీంనగర్, సెప్టెంబర్ 10:అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నాయకులు, రైతులు ఆందోళన చేపట్టారు. జగిత్యాల-నిజామాబాద్ జాతీయ రహదారిపై గురువారం సుమారు గంటన్నరపాటు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి మేడిపల్లి మండల పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో తరచూ విద్యుత్ కోతలు విధించడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు.

ఎన్నికలకు ముందు రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ఆరు గంటలపాటు కూడా నిరంతర విద్యుత్ సరఫరా చేయలేకపోతోందని ఆరోపించారు. వెంటనే విద్యుత్ కోతలను ఎత్తివేసి రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.

ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని నాయకులు, రైతులను సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వెనక్కి తగ్గలేదు. ట్రాన్స్‌కో ఎస్ఈ వచ్చి సమాధానం చెప్పే వరకు ఆందోళన విరమించబోమని భీష్మించుకుని కూర్చున్నారు. అనంతరం ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడించగా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నిరసన కారణంగా జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోగా, అత్యవసరంగా వచ్చిన రెండు అంబులెన్స్‌లకు ఆందోళనకారులు దారి వదిలి పంపించారు.

## చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, సెప్టెంబర్ 10: సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడిన చారిత్రక యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పేదల భూముల కోసం, భుక్తి కోసం ఆమె చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారిణిగా, తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాతగా, సామాజిక పరిణామాలకు మార్గదర్శకంగా చాకలి ఐలమ్మ నిలిచారని కొనియాడారు.వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కృష్ణాపురం గ్రామంలో 1895 సెప్టెంబర్ 26న ఓరుగంటి మల్లమ్మ, సాయిలు దంపతులకు నాలుగో సంతానంగా ఐలమ్మ జన్మించారని కలెక్టర్ తెలిపారు. 1940-44 మధ్య కాలంలో విస్నూర్ దేశ్‌ముఖ్‌లు, రజాకర్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఎదురు తిరిగి తెలంగాణ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించి విజయం సాధించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం. రవీందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు.

### -రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.
### -కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి.
### -సన్నాహక సమావేశంలో అధికారులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ దిశానిర్దేశం.

సంగారెడ్డి, సెప్టెంబర్ 10(నె?టి నిజం ప్రతినిధి)ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సజావుగా సేకరించేందుకు ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో అంకితభావంతో పనిచేయాలని సూచించారు.



2026-27 వానాకాలం సీజన్‌లో వరి ధాన్యం సేకరణకు సంబంధించి గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ టి.ఎల్. సంగీతతో కలిసి సంబంధిత శాఖల అధికారులు, రవాణా కాంట్రాక్టర్లతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. దీనికి అనుగుణంగా జిల్లాలో 227 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. సన్న రకంకు దొడ్డు రకం ధాన్యానికి అవసరమైన విధంగా వేర్వేరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.రైతుల పంట దిగుబడి చేతికందే సమయానికి ఆయా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రైతులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి పూర్తి మద్దతు ధర పొందేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, తేమ కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలు, గన్నీ బ్యాగులు తదితరాలను తగినంతగా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. తూకం, తరుగు తదితర అంశాల్లో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

తగిన సంఖ్యలో రవాణా వాహనాలను ముందుగానే సమకూర్చుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన ప్రదేశాలను/ గోడౌన్లను గుర్తించాలని అధికారులకు సూచించారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కొనుగోలు కేంద్రాల్లో ముందుగానే సిద్ధంగా ఉంచాలని అన్నారు.

ధాన్యం సేకరణ ప్రారంభమైనప్పటి నుంచి ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్. సాంగీత, డీఎస్ఓ బాలసరోజ, సివిల్ సప్లయిస్ డీఎం జయశ్రీ, డీసీఓ కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, జిల్లా మార్కెటింగ్, రవాణా, డీఆర్‌డీఓ, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా కేంద్రీయ విద్యాలయ ప్రవేశాల లక్కీ డ్రా

### సిఫార్సులకు తావులేకుండా నిబంధనల ప్రకారమే ప్రవేశాలు

### జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి



ములుగు, సెప్టెంబర్ 10:(నేటినిజం ప్రతినిధి): కేంద్రీయ విద్యాలయ ప్రవేశాలకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి తెలిపారు.

గురువారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయ తరగతుల్లో ప్రవేశాల కోసం లక్కీ డ్రా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయ ప్రవేశాల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ఎలాంటి సిఫార్సులు, పైరవీలకు తావులేకుండా కేంద్రీయ విద్యాలయ నిబంధనలను అనుసరించి నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలన, అర్హతల నిర్ధారణతోపాటు అందుబాటులో ఉన్న సీట్లను లక్కీ డ్రా ద్వారా భర్తీ చేసి, ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సిద్ధార్థ రెడ్డి, కేంద్రీయ విద్యాలయ ప్రధానాచార్యులు సీతారాం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ భూపేన్ హజారికా శత జయంతి..నివాళులు అర్పించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:మహనీయుడు డాక్టర్ భూపేన్ హజారికా శత జయంతి సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు.

డాక్టర్ భూపేన్ హజారికా గళం అస్సాం ఆత్మతో పాటు ఈశాన్య ప్రాంతాల ఉత్సాహాన్ని దేశం నలుమూలలకూ చేరవేసిందని ప్రధానమంత్రి ప్రశంసించారు. డాక్టర్ హజారికా తన సంగీతంతో అసంఖ్యాకుల ఆలోచనలను, భావాలను సుందరంగా వ్యక్తీకరించారనీ, ప్రజలను చేరువగా తీసుకువచ్చారనీ ప్రధానమంత్రి వర్ణించారు.

కిందటి సంవత్సరం గువాహటీలో డాక్టర్ హజారికా శత జయంతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నప్పటి జ్ఞాపకాలను శ్రీ మోదీ ఆప్యాయంగా గుర్తుచేసుకున్నారు.

భూపేన్ దా జీవితం, ఆయన సృజనలు భావి తరాల వారికి కూడా స్ఫూర్తిని అందిస్తుంటాయని ప్రధానమంత్రి అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి పొందుపరుస్తూ:

"మహానుభావుడు డాక్టర్ భూపేర్ హజారికా గారిని ఆయన వందో జయంతి సందర్భంగా స్మరించుకుంటున్నాను.

ఆయన గళం అస్సాం ఆత్మనీ, ఈశాన్య ప్రాంతాల ఉత్సాహాన్నీ దేశ ప్రజలందరి చెంతకు చేరవేసింది.

ఆయన తన సంగీతంతో అసంఖ్యాకుల ఆలోచనలను, భావనలను సుందరంగా వ్యక్తీకరించారు. ఆయన పాటలు ప్రజలను సన్నిహితం చేశాయి.

కిందటి ఏడాది గువాహటీలో ఆయన శత జయంతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాలుపంచుకోవడాన్నినేను ఆప్యాయంగా గుర్తుచేసుకుంటున్నాను. భూపేన్ దా జీవితం, ఆయన సృజనలు రాబోయే తరాల వారికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు.

# జ్ఞానానికి ఉన్న ప్రాధాన్యాన్ని సూచిస్తున్న సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:జ్ఞానానికి సంబంధించిన ఏ శాఖ నుంచి అయినా సరే.. అది చిన్నది గాని లేక పెద్దది గాని.. వివేకం గల వారు, బుద్ధిమంతులు దాని సారాన్ని గ్రహించాలని చెబుతున్న సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు. ప్రతి మూలం నుంచి విలువైన జ్ఞానాన్ని వ్యక్తి పొంది, మనసులోకి తీసుకోవాలని అవసరం ఎంతయినా ఉందని ఆయన స్పష్టం చేశారు.

"అణుభ్యశ్చ మహద్భ్యశ్చ శాస్త్రేభ్యః కుశలో నరః, సర్వతః సారమాద్యాత్ పుష్పేభ్య ఇవ షట్పదః" అన్న ఓ సంస్కృత సుభాషితాన్ని ప్రధానమంత్రి పంచుకున్నారు.

ఒక తేనెటీగ ప్రతి ఒక్క పుష్పం నుంచి తేనెను సంగ్రహించిన మాదిరిగానే వివేకి, బుద్ధిమంతుడు జ్ఞానాన్ని ఏ శాస్త్రం నుంచి అయినా సరే, అది చిన్న శాస్త్రం కావచ్చు, లేదా పెద్ద శాస్త్రం కావచ్చు.. దానిలోని సారాన్ని గ్రహించాలి. అలాగే, ఏ మూలాన్నుంచి అయినా అత్యంత విలువైన జ్ఞానాన్ని వ్యక్తి పొంది, దానిని మనసు లోపలకు తీసుకోవాలని ఈ సుభాషితం మనకు బోధిస్తోంది.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధాన మంత్రి ఒక సందేశాన్ని పొందుపరుస్తూ:

"అణుభ్యశ్చ మహద్భ్యశ్చ శాస్త్రేభ్యః కుశలో నరః, సర్వతః సారమాద్యాత్ పుష్పేభ్య ఇవ షట్పదః" అని పేర్కొన్నారు.

## చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు

**వీర వనిత సేవలను స్మరించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ**



ఖమ్మం, సెప్టెంబర్ 10: తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు. గురువారం వైరా మున్సిపల్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి చంద్రకళ మురళీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడి ప్రజల్లో స్ఫూర్తిని నింపారని ఆమె పేర్కొన్నారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చంద్రకళ మురళీకృష్ణ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, మేనేజర్ సుధీర్, జేఏఓ కిరణ్, బిల్ కలెక్టర్ జీవీ వేముల రత్నాకర్, పూర్ణకంటి రామారావు, నల్లమోతు సురేష్, ఓర్సు శ్రీనివాసరావుతో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో ఘనంగా "సేవా సంకల్ప్ అభియాన్"

**సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు బూత్ స్థాయిలో సేవా కార్యక్రమాలు**

**ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: అజ్మీరా సీతారాం నాయక్**

ములుగు, సెప్టెంబర్ 10:(నేటినిజం ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా ఆధ్వర్యంలో "సేవా సంకల్ప్ అభియాన్" జిల్లా కార్యశాల సమావేశం గురువారం ములుగు పట్టణంలోని రాయల్ ప్లాజాలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం గారి అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశానికి మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ గారు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా అజ్మీరా సీతారాం నాయక్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి 25 ఏళ్ల ప్రజా జీవితం, సేవ, అంకితభావాన్ని ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా "సేవా సంకల్ప్ అభియాన్" నిర్వహిస్తోందన్నారు.

సెప్టెంబర్ 17న నరేంద్ర మోదీ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెలరోజుల పాటు ములుగు జిల్లాలోని ప్రతి బూత్‌లో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రక్తదాన శిబిరాలు, ఆరోగ్య సేవలు, స్వచ్ఛత కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలు తదితర కార్యక్రమాలను బూత్ స్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ప్రధాని నరేంద్ర మోదీ గారు ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రజాసేవలో సుదీర్ఘ అనుభవాన్ని సంపాదించి, దేశ అభివృద్ధి, ఆర్థిక పురోగతి, జాతీయ భద్రత, సంక్షేమం మరియు మౌలిక వసతుల అభివృద్ధికి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను పెంచుతూ, "వికసిత్ భారత్" లక్ష్యంతో దేశాన్ని ముందుకు తీసుకెళుతున్నారని అన్నారు.

నరేంద్ర మోదీ గారి జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా "సేవే సంకల్పం ? సేవే సాధనం" అనే స్ఫూర్తితో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలుగా నిర్వహించాలని కోరారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ములుగు జిల్లాలో సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయడంలో బీజేపీ కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు.

జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ, ములుగు జిల్లాలోని ప్రతి బూత్‌ను సేవా కార్యక్రమాలకు కేంద్రంగా మార్చి, ప్రజలతో మరింత సన్నిహితంగా పనిచేసేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.

ఈ సమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్యా జవహర్ లాల్, జిల్లా ఉపాధ్యక్షులు జినుకల కృష్ణాకర్ రావు, ఏనుగు రవిందర్ రెడ్డి, మద్దినేని తేజ రాజు, అల్లె శోభన్, మేడిశెట్టి ఓమ్రా, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీలమంతుల రవింద్రాచారి, జాడి వెంకట్, నగరపు రమేశ్, ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు పల్ల బుచ్చయ్య, రాష్ట్ర పాలసీ రీసెర్చ్ కో-కన్వీనర్ గుగులోతు స్వరూప, జిల్లా కలు తోటకూరి మధు, కొత్త సుధాకర్ రెడ్డి, చందా జ్యోతి, కోశాధికారి గంగిశెట్టి రాజ్ కుమార్, కార్యాలయ కార్యదర్శి సూర్యదేవర విశ్వనాథ్, జిల్లా మోర్చా అధ్యక్షులు మాదరి శ్రీకాంత్, కొర్ర సుమలత, జాడి రామరాజు, సిద్ధం బోయిన సురేందర్, దండిగా వెంకన్న, మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు, పైడాకుల మల్లేశ్, వినుకోల్ల చక్రవర్తి, బైకాని మహేందర్, ప్రవీణ్ చారి, మురళి, కుక్కల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పోషణ్ కార్యక్రమాలు, అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతంపై వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:కేంద్ర మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి రాసిన ఒక వ్యాసాన్ని ప్రజలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు.

'మాతృ వందన యోజన'కు పది సంవత్సరాలతో పాటు, 'పోషణ మాసం' సందర్భంగా రాసిన ఆ వ్యాసం.. అంగన్‌వాడీ వ్యవస్థను ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలన్న సందేశాన్నిస్తోంది. బాలలకు, మహిళలకు, యౌవన దశలో ఉన్న బాలికలకు ప్రయోజనాల ప్రత్యక్ష బదిలీ (డీబీటీ), సామాజిక ఆడిట్లు, పుష్టికరమైన ఆహారం ఏ విధంగా సాయపడుతున్నదీ ఈ వ్యాసం వివరించింది. ఈ కార్యక్రమాలు "హమారీ అంగన్‌వాడీ, హమారీ జిమ్మేదారీ" (మా అంగన్‌వాడీ, మా బాధ్యత) దార్శనికత నుంచి స్ఫూర్తిని పొంది పోషకాహార లోపానికి తావు ఇవ్వని, 'అభివృద్ధి చెందిన భారత్'ను ఆవిష్కరించడానికి తోడ్పడుతున్నాయని మంత్రి వివరించారు.

'మాతృ వందన యోజన'కు పది సంవత్సరాలు, 'పోషణ మాసం' అంశాలపై కేంద్ర మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవి గారు రాసిన ఈ వ్యాసం అంగన్‌వాడీ వ్యవస్థను ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలనే సందేశాన్ని ఇస్తోంది. బాలలు, మహిళలు, యవ్వన దశకు చేరుకున్న బాలికలకు డీబీటీ, సోషల్ ఆడిట్, పౌష్టిక ఆహారంతో మద్దతు లభిస్తున్న తీరును మంత్రి ఈ వ్యాసంలో ప్రస్తావించారు. ఈ కార్యక్రమాలు.. 'హమారీ అంగన్‌వాడీ, హమారీ జిమ్మేదారీ' దార్శనికతతో పోషకాహార లోపానికి చోటు ఉండని, 'వికసిత్ భారత్' గమ్యాన్ని చేరుకోవడానికి తోడ్పడుతున్నాయి" అని పేర్కొంది.

# గిరిజన గురుకులంలో వైరల్ ఫీవర్

**జ్వరాల బారిన 15 మంది విద్యార్థులు..**

**అపరిశుభ్ర వాతావరణమే కారణమంటున్న తల్లిదండ్రులు**

**వసతుల కొరతపై ఆవేదన..**

**విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ జ్యోత్స్న**

నల్గొండ, సెప్టెంబర్ 10:యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు వైరల్ ఫీవర్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా వాష్‌రూమ్‌లు, స్నానపు గదులు లేకపోవడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతోనే విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 15 మంది విద్యార్థులకు గత రెండు రోజులుగా జ్వరాలు రావడంతో తోటి విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.మరికొందరు విద్యార్థులకు గజ్జి, తామర, జలుబు వంటి అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిసింది. జ్వరాల బారిన పడిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు.

కేసారి 15 మంది విద్యార్థులకు జ్వరాలు రావడంతో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యంలోని సిబ్బంది గురుకుల పాఠశాలను సందర్శించి వైద్య సేవలు అందించారు.జ్వరాల బారిన పడిన విద్యార్థులతో పాటు పాఠశాలలోని ఇతర విద్యార్థులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైరల్ ఫీవర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత పాటించాల్సిన ఆవశ్యకతపై డాక్టర్ జ్యోత్స్న విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సంబంధిత అధికారులు గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. వాష్‌రూమ్‌లు, స్నానపు గదులు తదితర సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొలనుపాకలో రైతుల రాస్తారోకో

నల్గొండ, సెప్టెంబర్ 10: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు గురువారం భారీ ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. గంటల తరబడి కొనసాగుతున్న అప్రకటిత విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆలేరు?సిద్దిపేట రహదారిపై రైతులు నిరసన చేపట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో వ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నినాదాలు చేశారు.

రైతుల రాస్తారోకోతో ఆలేరు-సిద్దిపేట ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. కొంతసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రైతుల ఆందోళనకు వివిధ విపక్ష రాజకీయ పార్టీల నాయకులు, పేర్కొంది.

# డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌లో నమోదైన 1,600కి పైగా సంస్థలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10:డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ప్రజల రక్షణలో భాగంగా టెలికమ్యూనికేషన్స్ శాఖ (డీఓటీ) 2025 మే 22న ప్రారంభించిన ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ (ఎఫ్ఆర్ఐ) మొదటి పదిహేను నెలల్లోనే రూ. 5,000 కోట్లకు పైగా విలువైన సైబర్ మోసాలను నివారించడంలో సహాయపడింది. ఈ డబ్బును ట్రాక్ చేయడం, ఫ్రీజ్ చేయడం లేదా రికవరీ చేయాల్సిన అవసరం రాలేదు. ఇది మూలం వద్దే పౌరుడి ఖాతాను విడిచిపెట్టి వెళ్లలేదు.

మొదటి ఆరు నెలల కాలంలో రూ. 660 కోట్ల మోసాలను నివారించిన ఇది ఇప్పుడు రూ. 5,000 కోట్లకు పైగా ఘనతను అందుకోవటం దీని విస్తరణకు తెలియజేస్తోంది. డిజిటల్ ఆర్థిక మోసాల నుంచి ప్రజలను రక్షించడంలో టెలికాం ఇంటెలిజెన్స్ పాత్ర పెరుగుతుండటంతో పాటు టెలికాం, బ్యాంకింగ్, ఫిన్‌టెక్, సెక్యూరిటీస్, బీమా, చట్టపరమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థల మధ్య సమన్వయ చర్యలకు ఉన్న బలాన్ని ఇది ప్రతిబింబిస్తోంది.

రూ. 5,000 కోట్ల గణాంకాల వెనుక లక్షలాది మందిని వ్యక్తిగతంగా కాపాడిన సందర్భాలు ఉన్నాయి. నకిలీ కేవైసీ కాల్ కారణంగా జీవితకాలపు పొదుపును కోల్పోని పింఛనుదారు, మోసపూరిత సరఫరాదారుకి చెల్లించే విషయంలో ఖాతా నుంచి డెబిట్ అయ్యే కొన్ని క్షణాల ముందు చెల్లింపు ఆపేసిన చిన్న వ్యాపారి, స్క్రీన్‌పై హెచ్చరికను చూసి నిలిపివేసిన మొదటిసారి డిజిటల్ యూజర్ వంటి క్షణాలు ఉన్నాయి. ప్రతి సందర్భంలోనూ తదనంతరం విచారణల ఇబ్బంది లేకుండా మోసం జరగకముందే ప్రజలకు రక్షణ అందింది.

రక్షణ విషయంలో వేగం గణనీయంగా పుంజుకుంది. బ్యాంకులు, పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లలో ఈ అమలు మరింత వ్యవస్థీకృతంగా మారడంతో ఎఫ్ఆర్ఐ వినియోగం ద్వారా కూడబెట్టిన పొదుపులు 2025 ఆగస్టు నాటికి ఉన్న రూ. 139.16 కోట్ల నుంచి 2026 ఆగస్టు నాటికి రూ. 5,043.73 కోట్లకు పెరిగాయి. ఒక్క 2026 ఏప్రిల్ నుంచి నాలుగు నెలల్లోనే రూ. 2,000 కోట్లకు పైగా నష్టాన్ని నివారించారు.

టెలికమ్యూనికేషన్స్ శాఖ (డీఓటీ) అభివృద్ధి చేసిన ఒక వినూత్న రిస్క్-అసెస్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ ఎఫ్ఆర్ఐ. ఒక మొబైల్ నంబర్ సైబర్ నేరం లేదా ఆర్థిక మోసంతో సంబంధం కలిగి ఉండే అవకాశాన్ని ఆర్థిక సంస్థలు నిజ సమయంలో అంచనా వేయడానికి ఇది సహాయపడుతుంది.

డీఓటీకి చెందిన డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ (డీఐపీ) ఆధ్వర్యంలో ఎఫ్ఆర్ఐ రూపుదిద్దుకుంది. ఇది ఆర్థిక మోసాలలో ప్రమేయం ఉండే సంభావ్యత ఆధారంగా మొబైల్ నంబర్లను మధ్యస్థ, అధిక లేదా అత్యధిక రిస్క్ అనే 3 విభాగాలుగా వర్గీకరిస్తుంది. ఈ వర్గీకరణ అనేక వనరుల నుంచి సేకరించిన సమాచారంపై ఆధారపడి ఉంటుంది. సంచార్ సాథీ ప్లాట్‌ఫామ్‌లో ప్రజల రిపోర్టులు.. ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు (ఐ4సీ) చెందిన నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ), టెలికాం ఆపరేటర్లు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పంచుకున్న సమాచారం.. ఇతర టెలికాం సంబంధిత సూచికలు ఇందులో ఉన్నాయి. డీఓటీకి చెందిన డీఐపీ ద్వారా ఈ సమాచారాన్ని బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, బీమా సంస్థలు, సెక్యూరిటీస్ మధ్యవర్తులు, పింఛను రంగ సంస్థల సురక్షితంగా అందుకుంటాయి. వినియోగదారుల ఆన్‌బోర్డింగ్, బదిలీల పర్యవేక్షణ, మోసాల గుర్తింపు వ్యవస్థలతో టెలికాం-రిస్క్ ఇంటెలిజెన్స్‌ను కలపటం ద్వారా ఆర్థిక నష్టాలు సంభవించకముందే హై-రిస్క్ లావాదేవీలను గుర్తించేందుకు సంస్థలకు వీలవుతుంది.

# బొగ్గు కంపెనీల కోసం తొలి ప్రత్యేక 'సీఎస్ఆర్' చట్రానికి కేంద్ర బొగ్గు-గనులశాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి శ్రీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) తాము కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద చేపట్టిన ప్రధాన కార్యక్రమాలు 'తలసేమియా బాల్ సేవా యోజన' (టీబీఎస్‌వై), 'నన్హా సా దిల్' ద్వారా సాధించిన కీలక విజయాలపై న్యూఢిల్లీలో ఇవాళ ఒక వేడుకను నిర్వహించాయి. ఇదే వేదికపై భారతీయ బొగ్గు కంపెనీల కోసం సమగ్ర 'సీఎస్ఆర్' చట్రాన్ని కూడా ఆవిష్కరించాయి.

ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు-గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే, కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్ హాజరు కాగా, పలువురు ఉన్నతాధికారులు సహా వైద్య నిపుణులు, పథకాల అమలు భాగస్వామ్య సంస్థలు, లబ్ధిదారుల కుటుంబాలు కూడా ఇందులో పాల్గొన్నారు.

అరుదైన జన్యు సంబంధిత రక్త రుగ్మతలు- తలసేమియా, అప్లాస్టిక్ అనీమియా పీడితులైన బాలల చికిత్స లక్ష్యంగా 'టీబీఎస్‌వై'ని దేశవ్యాప్తంగా ప్రారంభించారు. ఇది తొలుత 4 ఆసుపత్రులతో మొదలై, ప్రస్తుతం 21 గుర్తింపు పొందిన ఆసుపత్రుల స్థాయికి విస్తరించింది. ఈ అరుదైన జన్యు సంబంధ రక్త రుగ్మతల పీడితులకు చికిత్స కోసం ఇంత భారీ స్థాయిలో ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం చేపట్టిన ఏకైక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ) 'సీఐఎల్' ఒక్కటే కావడం గమనార్హం. నాలుగు దశలలో అమలు చేసే ఈ పథకాన్ని రూ.130 కోట్లతో చేపట్టగా, ఎముక మజ్జ మార్పిడి (బీఎంటీ) చికిత్స కోసం ప్రతి రోగికి రూ.10 లక్షల వంతున గుర్తింపు పొందిన ఆసుపత్రులకు నేరుగా నిధులు అందజేస్తారు. ఈ మేరకు ఇప్పటిదాకా 1,050 మందికి పైగా బాలలు బీఎంటీ ప్రక్రియ ద్వారా చికిత్స పొందారు. వీరిలో అత్యధికులు ఇప్పుడు సాధారణ, ఆరోగ్యకర జీవితం గడుపుతుండటం విశేషం. 'తలసేమిక్స్ ఇండియా' సహకారంతో అమలయ్యే ఈ పథకాన్ని కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ మార్గదర్శక సూత్రాల ప్రకారం పర్యవేక్షిస్తున్నారు.

దేశంలో ఏటా సుమారు 2.4 లక్షల మంది నవజాత శిశువులు పుట్టుకతో సంక్రమించే గుండె జబ్బుల (సీహెచ్‌డీ)కు లోనవుతున్నారు. వీరిలో కేవలం 5 శాతం బాలలకు మాత్రమే సకాలంలో చికిత్స లభిస్తుండగా, 'శ్రీ సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్' భాగస్వామ్యంతో సీఐఎల్ 'నన్హా సా దిల్' పేరిట పథకాన్ని ప్రారంభించింది. జార్ఖండ్‌లోని నాలుగు జిల్లాల్లో 2024 మార్చిలో ఈ పథకానికి శ్రీకారం చుట్టగా, సీఐఎల్ అనుబంధ సంస్థలైన ఎస్ఈసీఎల్, సీసీఎల్, ఎన్‌సీఎల్, డబ్ల్యూసీఎల్ దీన్ని మరింత విస్తరింపజేశారు. ఆధునిక రోగ నిర్ధారణ ఉపకరణాల ద్వారా 2 లక్షల మందికిపైగా బాలలకు పరీక్షలు నిర్వహించి 1,500 మందికి శస్త్రచికిత్స చేశారు. వారితోపాటు కుటుంబ సభ్యులకూ ప్రయాణ, ఆసుపత్రి ఖర్చులు సహా వైద్య సేవలు పూర్తి ఉచితంగా లభించాయి.

ఫలితాధారిత కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల దిశగా బొగ్గు రంగం కోసం సమగ్ర 'సీఎస్ఆర్' చట్రాన్ని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. కంపెనీల చట్టం-2013 ప్రకారం చట్టబద్ధ 'సీఎస్ఆర్' అమలులోకి వచ్చాక ప్రత్యేకించి ఒక రంగం కోసం తొలిసారి ఇలాంటి చట్రం రూపొందడం ఓ కీలక ఘట్టం. ఈ చట్రాన్ని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసీఏ) రూపొందించింది. బొగ్గు గనుల ప్రాంతాల్లో నివసించే ప్రజల ప్రయోజనార్థం, ప్రభావశీల, ఫలితాధారిత 'సీఎస్ఆర్'కు ఇది మార్గనిర్దేశం చేస్తుంది.

ఈ సందర్భంగా శ్రీ జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ- గత దశాబ్ద కాలంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, జీవనోపాధి, సామాజికాభివృద్ధి రంగాలలో సీఐఎల్ కొనసాగిస్తున్న సీఎస్ఆర్ నిబద్ధతను కొనియాడారు. ఈ మేరకు అమలు చేస్తున్న 'టీబీఎస్‌వై', 'ఎన్ఎస్‌డీ' పథకాలతోపాటు 'ఎస్ఈసీఎల్' 'సుశ్రుత్' వంటి కీలక కార్యక్రమం నిర్వహించడాన్ని ఆయన ప్రశంసించారు. తలసేమియా, పుట్టుకతో వచ్చే గుండె జబ్బులతో దేశవ్యాప్తంగా అనేకమంది బాలల బాధపడుతున్నారని గుర్తుచేశారు. వారి ప్రయోజనార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అమలు సంస్థలు, తల్లిదండ్రుల సంఘాలు సహా యావత్ సమాజం బాధ్యత స్వీకరించాల్సిన ఆవశ్యకతను ఆయన స్పష్టం చేశారు. ఈ పథకాల కింద చికిత్స పొంది కోలుకున్న బాలల ఉజ్వల భవిష్యత్తు దిశగా వారి విద్యావసరాలకు ప్రభుత్వ చేయూత ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

ప్రతి బిడ్డకూ మెరుగైన చికిత్స, అవసరమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, గౌరవప్రద జీవనానికి తగిన అవకాశాలు అందుబాటులో ఉండాలని బొగ్గు-గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే అన్నారు. తలసేమియా బాధితులకు చికిత్స, వారి కుటుంబాలకు మద్దతుగా సీఐఎల్ తన 'సీఎస్ఆర్' కార్యక్రమాల ద్వారా చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్ ప్రసంగిస్తూ- ఆపన్నులైన బాలలు, వారి కుటుంబాలకు ప్రాణరక్షక ఆరోగ్య సంరక్షణ కల్పనలో సీఐఎల్ చేపట్టిన సీఎస్ఆర్ కార్యక్రమాల పరిణామాత్మక ప్రభావాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ క్రమంలో వైద్యులు, చికిత్సలందించే జాబితాలోని ఆసుపత్రులు, భాగస్వామ్య సంస్థల నిస్వార్థ సేవాభావనను ఆయన ప్రశంసించారు. నాణ్యత, హామీ సహిత సంరక్షణ, కేసులపై తక్షణ పర్యవేక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం, విస్తరణ సామర్థ్యం వంటివి ఈ కార్యక్రమాలకు కీలక స్తంభాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత బొగ్గు మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి శ్రీమతి రూపీదర్ బ్రార్ ఆహూతులకు స్వాగతం పలికారు. ప్రజల జీవన స్థితిగతులను తెలుసుకోవడం, సమాజాలకు సాధికారత కల్పన, అత్యంత ఆపన్నులకు అవకాశాల సృష్టిలోనే సీఎస్ఆర్ వాస్తవిక స్ఫూర్తి ప్రస్ఫుటం కాగలదని ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమాలు స్థానిక అవసరాలతో మమేకమై, సునిశిత ప్రణాళిక సహితంగా విస్పష్ట ఫలితాలు సాధించేలా చూసుకోవాల్సిన అవసరాన్ని ఆమె స్పష్టం చేశారు. ఈ కొత్త చట్రంతో బొగ్గు రంగమంతటా సీఎస్ఆర్ కార్యకలాపాలు మరింత ప్రభావశీలం, నిర్మాణాత్మకం, పారదర్శకం, ఫలితాధారితంగా సాగడంలో ఈ చట్రం ఓ కీలక మలుపని చెప్పారు. తద్వారా ప్రతి కార్యక్రమం క్షేత్రస్థాయిలో వాస్తవ ప్రయోజనకారిగా మారి, బలమైన, ఆరోగ్యకర, సాధికార సమాజ వికాసానికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రి ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్ అధిపతి డాక్టర్ శాంతను సేన్ మాట్లాడుతూ- దేశంలో ఏటా 10,000 మందికి పైగా బాలలు తలసేమియాతో జన్మిస్తున్నారని వెల్లడించారు. వారి జీవితమంతా రక్త మార్పిడితోనే గడిచిపోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. అయినప్పటికీ, వీరిలో అధికశాతం ఎక్కువ కాలం జీవించలేరని చెప్పారు.

# రైతు చెమట పరిమళం... దువ్వూరినింపిన కవిత్వం"

## సెప్టెంబర్ 11...కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి వర్ధంతి



తెలుగు సాహిత్య చరిత్రలో 20వ శతాబ్దం అత్యంత విప్లవాత్మకమైన కాలం. ఆ కాలంలో కవిత్వం, సాంప్రదాయ అలంకారాల కట్టుబాట్ల నుంచి విముక్తి పొంది, సమాజ వాస్తవాల వైపు పయనించింది. ఈ మార్గాన్ని నిర్మించడంలో, ముఖ్యంగా గ్రామీణ జీవన వాస్తవాలను కవిత్వంలో ప్రతిబింబింప జేయడంలో దువ్వూరి రామిరెడ్డి పేరు ఎల్లప్పుడూ ప్రథమ కక్ష్యలో నిలుస్తుంది. రైతు జీవితం లోని చెమట, కన్నీరు, ఆశలు, నిరాశలు, భూమి తల్లితో ఉన్న అనుబంధం ? ఇవన్నింటినీ ఆయన కవిత్వం తన స్వర సౌందర్యంతో మిళితం చేసింది. అందుకే ఆయనను సాహిత్య ప్రపంచం "రైతు కవి", "కవి కోకిల" అని గౌరవంగా అభివర్ణించింది.

దువ్వూరి రామిరెడ్డి 1895 నవంబర్ 9న ప్రస్తుత శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరులో జన్మించారు. తల్లిదండ్రులు సుబ్బరామిరెడ్డి, రంగమ్మ. చిన్నతనం నుంచే ఆయనలో సాహిత్యాసక్తి పుట్టి, కవిత్వంపై మక్కువ పెరిగింది. మెట్రిక్యులేషన్ వరకు చదివినా, తరువాత స్వయంగా సంస్కృతం, ఆంగ్లం, ప్రాకృతం వంటి భాషలలో దిట్ట అయ్యారు. పుస్తకాల పఠనం ఆయనకు దారి చూపగా, పల్లెటూరి వాతావరణం, పొలాల మధ్య రైతు శ్రమ, ప్రకృతి సౌందర్యం ఆయన మనసును ప్రభావితం చేశాయి. జీవితాంతం ఆయన వ్యవసాయాన్ని జీవనాధారంగా, కవిత్వాన్ని హృదయాధారంగా స్వీకరించారు.

ఆయన సాహిత్య ప్రస్థానం తెలుగు కవిత్వానికి ఒక కొత్త దిశను చూపింది. 1925లో వెలువడిన "కృషీ వలుడు" ఆయనకు విశేష ఖ్యాతి తెచ్చిపెట్టింది. ఇందులో రైతు జీవనాన్ని అత్యంత వాస్తవికంగా, భావోద్వేగంతో వర్ణించారు. పల్లె జీవనపు సౌందర్యం, రైతు శ్రమలోని విలువ, భూమి తల్లి పట్ల ఆరాధన – ఇవన్నీ ఈ కావ్యంలో ప్రతిబింబించాయి.

తెలుగు కవిత్వంలో రైతు వర్గం సమస్యలను ఇంత లోతుగా ప్రతిఫలింపజేసిన కావ్యాలు అరుదు. రైతు పాటను, రైతు కన్నీటిని, రైతు గుండె చప్పుళ్లను సాహిత్యంలో శాశ్వతంగా నిలిపిన కృషి దువ్వూరివే.

1927లో ఆయన చేసిన "పానశాల" అనువాదం తెలుగు పాఠకులకు కొత్త తాత్విక లోకాన్ని పరిచయం చేసింది. ఒమర్ ఖయ్యామ్ పర్షియన్ కవిత్వాన్ని తెలుగు భాషలో మలచి, క్షణికానందం, జీవన తాత్పర్యం, మానవ జీవితపు అనిశ్చితి వంటి అంశాలను సున్నితంగా ఆవిష్కరించారు. "వనకుమారి", "జలదాంగన", "అహల్య", "మధు సంచయం" వంటి ఇతర రచనల్లో ప్రేమ, ప్రకృతి వైభవం, పురాణ కథనాల మానసిక లోతులు ప్రతిఫలించాయి. "కృష్ణవేణి", "కార్షకులు", "కరుణ", "మల్లెపూలు" వంటి ఆయన సృజనాత్మక కృతులు గ్రామీణ జీవనాన్ని, మానవతను, ప్రకృతిని కవిత్వరూపంలో ఆవిష్కరించాయి.

దువ్వూరి రామిరెడ్డి కవిత్వం సౌలభ్యం, మాధుర్యం, భావ పరిపూర్ణతతో నిండివుంది. ఆయన భాష పల్లెటూరి వాసనలాగే సహజసిద్ధంగా ఉంటుంది.

మాధుర్యం వలననే నెల్లూరులోని సనాతన ధర్మ కళాశాల ఆయనకు "కవి కోకిల" బిరుదు ప్రదానం చేసింది. కవిసభల్లో, సాహిత్య వర్గాల్లో ఆయన కవిత్వాన్ని విన్నవారు కవిగానం అనుభూతిని పొందేవారు.

ఆయన సాహిత్య సేవలకు గాను వివిధ విశ్వవిద్యాలయాలు, సాహిత్య సంఘాలు గౌరవించాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయనను జ్ఞానపీఠ అవార్డుకు తెలుగు రచయితల తరఫున సిఫార్సు చేసిన సందర్భమూ ఉంది. ఆయన కీర్తి కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాక, భారత సాహిత్య వేదికలపై కూడా ప్రతిధ్వనించింది.

1947 సెప్టెంబర్ 11న ఆయన కన్నుమూశారు. దేశ స్వాతంత్ర్యం వచ్చిన వేళలోనే తెలుగు సాహిత్యం ఒక మహనీయ కవిని కోల్పోయింది. అయినా ఆయన కవిత్వం ఇప్పటికీ పల్లె పొలాల్లో మురిపించే పల్లె పాటల్లా, రైతు చెమట పరిమళంలా నిలిచివుంది. నేటికీ రైతు సమస్యలపై చర్చలప్పుడు, గ్రామీణ వాస్తవాలపై విశ్లేషణలప్పుడు ఆయన కవిత్వం ప్రస్తావన తప్పనిసరిగా వస్తుంది.

దువ్వూరి రామిరెడ్డి కవిత్వం భూమి తల్లిని స్తుతించిన రైతు స్వరమైతే, తెలుగు సాహిత్యానికి రైతు జీవితాన్ని పరిచయం చేసిన ప్రథమ యత్నం కూడా. ఆయన రచనలు మనకు జీవనాన్ని చూడటానికి కొత్త కళ్ళను ఇస్తాయి, రైతు జీవితాన్ని అర్థం చేసుకోవడానికి కొత్త మనసును అందిస్తాయి. అందుకే ఆయన సాహిత్య వారసత్వం నిత్యనూతనంగా మనతోనే ఉంటుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

## -నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, సెప్టెంబర్ 10: (నేటినిజం ప్రతినిధి) భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసి, తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక, వీరనారి చాకలి ఐలమ్మ అని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లోని ఆమె విగ్రహానికి మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సామాజిక అసమానతలు, దోపిడీ, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువ, ఆత్మవిశ్వాసం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ కేవలం ఒక వ్యక్తి కాదు.. అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అని మేయర్ అన్నారు. ఆమె ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, గౌరవం కల్పించడమే నిజమైన నివాళి అని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ పాత్ర ఎంతో కీలకమైనదని, ఆమె ధైర్యసాహసాలు, త్యాగాలు తెలంగాణ ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, ఎన్నం ప్రకాష్, గాజ శివరాం, దేవసాని సత్యనారాయణ, మునిగంటి కుమార్, పొన్నాల రాము, ఉప్పరపల్లి శ్రీను, గుండారపు సంపత్, అవునూరి భరత్, వెంకట సాయి, న్యాత ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌ను 'గ్రీన్ సిటీ'గా తీర్చిదిద్దడమే లక్ష్యం -మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, సెప్టెంబర్ 10: (నేటినిజం ప్రతినిధి) పార్టీలకతీతంగా నగర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, కరీంనగర్‌ను సుందర, స్వచ్ఛ, హరిత నగరంగా గ్రీన్ సిటీ తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. గురువారం నగరంలోని 34వ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులకు మేయర్ శ్రీకారం చుట్టారు. స్థానిక కార్పొరేటర్ సమీనా పర్వీన్, జమ్ము తదితరులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 34వ డివిజన్ ప్రజలు మేయర్‌కు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అనంతరం మేయర్ కొబ్బరికాయ కొట్టి, అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ, గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న ఈ ప్రాంతం నగరంలో భాగమైన నేపథ్యంలో డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ప్రజలకు మౌలిక వసతులు, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నామని మేయర్ పేర్కొన్నారు. 34వ డివిజన్ అభివృద్ధికి ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.40 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. అదేవిధంగా యూఐడిఎఫ్ నిధుల నుంచి మరో రూ.50 లక్షలు వెచ్చించి డివిజన్‌లో మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి ప్రజల ప్రాథమిక అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని మేయర్ హామీ ఇచ్చారు. "నగరంలోని ప్రతి డివిజన్ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం. రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నాం. కరీంనగర్‌ను స్వచ్ఛ, సుందర, హరిత నగరంగా తీర్చిదిద్దే దిశగా నిరంతరం కృషి చేస్తాం" అని మేయర్ కొలగాని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ నెంబర్ నందకుమార్, మున్సిపల్ అధికారులు, స్థానిక డివిజన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 10:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజు పల్లెలో ఇటీవల మృతిచెందిన తెంబరవేణి అంజవ్వ భౌతిక కాయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి నివాళులు అర్పించారు. అలాగే వేములవాడ పట్టణానికి చెందిన సాగరం వెంకటస్వామి తల్లి సాగరం రామలక్ష్మి ఇటీవల మరణించగా, వారి కుటుంబాన్ని మనోహర్ రెడ్డి పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట బి ఆర్ ఎస్ నాయకులు వాసాల శ్రీనివాస్, సతీష్ రెడ్డి, ఐత వెంకటేశం, ప్రకాష్ ,సాయి గౌడ్,రాము గౌడ్, చందనం వెంకటేష్,తదితరులు ఉన్నారు

# వైరల్‌గా ఎమ్మెల్యే ఆది పాత ఫొటో

## నాటి లుక్‌పై సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 10:(నేటినిజం ప్రతినిధి): 80వ దశకం నాటి జ్ఞాపకాలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న నేపథ్యంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు సంబంధించిన ఓ పాత ఫొటో వైరల్‌గా మారింది. అప్పటి యువకుడిగా ఉన్న ఆయన లుక్, వేషధారణ నాటి తరాన్ని గుర్తుచేస్తుండటంతో అభిమానులు, ఆత్మీయులు ఆసక్తిగా స్పందిస్తున్నారు. ఫొటోను చూసిన పలువురు నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. అప్పటి ఆది శ్రీనివాస్ రూపానికి, ప్రస్తుత రూపానికి సంబంధించిన విషయాలను ప్రస్తావిస్తూ సరదాగా పోస్టులు పెడుతున్నారు. యువకుడి దశలోని ఈ ఫొటో.. ఆది శ్రీనివాస్ సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని కూడా గుర్తుచేస్తోంది. ఎన్నో ఏళ్లుగా ప్రజాజీవితంలో కొనసాగుతున్న ఆయన ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గా, వేములవాడ ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాటి ఫొటో వెలుగులోకి రావడంతో నియోజకవర్గంలో ఆసక్తి నెలకొంది.

# తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 10:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు, ప్రజా వీరనారి "చిట్యాల ఐలమ్మ"వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. సామాజిక అసమాన తలు, దోపిడి పెట్టి చాకిరికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించ దగి న దని అన్నారు. ఈ కార్యక్రమంలో గోస్కుల రవి, ఏస తిరుపతి ,గడ్డం హన్మాండ్లు, మ్యాకల శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, తంపుల సుమన్,వాసాల శ్రీనివాస్,రాజు ,అంజయ్య, దేవయ్య,నర్సయ్య,ఆంజనేయులు, పెద్ది రాజు, గోపు మధు,ప్రేమ్ చారి,రాకేష్, రాము గౌడ్, విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.






# ఆల్ఫోర్స్‌లో వినాయకచవితి ముందస్తు వేడుకలు




కరీంనగర్, సెప్టెంబర్ 10: (నేటినిజం ప్రతినిధి) వినాయక చవితిని పురస్కరించుకుని కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ముందస్తు గణేష్ నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలల నిర్వాహకులు డాక్టర్ వి. వనజా నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విఘ్నాలను తొలగించే దేవుడిగా, జ్ఞానం, విజయానికి ప్రతీకగా గణేశుడిని ఆరాధిస్తారని తెలిపారు. తల్లిదండ్రుల పట్ల విధేయత, కుటుంబ సభ్యుల పట్ల ఆప్యాయత వంటి విలువలను గణేశుడి కథలు చాటిచెబుతాయని పేర్కొన్నారు. దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ గణేష్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు విస్తరిస్తున్నాయని చెప్పారు. నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, సంకల్పం, అష్టోత్తర శతనామావళి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. గణపతి హోమం, పంచామృతాభిషేకం, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు, పుష్పార్చన, కుంకుమార్చనతో పాటు ప్రసాద వితరణ, అన్నదానం వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపడతారని వివరించారు. ప్రతిరోజూ సాయంత్రం భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులు, యువత, మహిళల్లోని ప్రతిభను వెలికితీసేలా ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. శాస్త్రీయ, జానపద నృత్యాలు, భక్తి గీతాలు, చిన్న నాటికలు, హరికథలు, కీర్తనలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వినాయకుడి వేషధారణలో పలువురు చిన్నారులు హాజరై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.